E KABURU - Digital News Paper
E-PAPER
ఈ-కబురు
@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
హైదరాబాద్ (తేదీ) 11-05-2026 (వారం) సోమవారం సంపుటి: 02 || సంచిక:129|| పేజీలు–6
www.ekaburu.com

మా ప్రాజెక్టులపై దృష్టి పెట్టండి

రాష్ట్రం కోసం 2 గంటలు కేటాయించండి
సమీక్షించి మా ప్రాజెక్టులకు అనుమతులిస్తే దేశ జీడీపీకి తెలంగాణ 10 శాతం తిరిగిస్తుంది
వికసిత్ భారత్‌కు ఊతమవుతుంది
మెట్రో నగరాల్లో కీలక ప్రాజెక్టుల కోసం సింగిల్ విండో విధానం పెట్టండి
ప్రధాని మోదీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ఈ-కబురు, హైదరాబాద్:
రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులపై దృష్టి సారించాలని, రెండు గంటలు సమయం కేటాయించి సమీక్షించి వేగంగా అనుమతులిస్తే దేశ జీడీపీకి 10 శాతం తెలంగాణ తిరిగిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేశారు. 'తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతిస్తే వికసిత్ భారత్‌కు ఊతమవుతుంది. రాష్ట్రానికి సంబంధించిన కొన్ని ప్రాజెక్టులకు అత్యవసర అనుమతులు కీలకం. ఈ విషయంలో నేను మిమ్మల్ని, కేంద్ర మంత్రులను అనేకసార్లు కలిశా' అని వివరించారు. మెట్రో రైలు, రీజినల్ రింగ్ రోడ్, ఫ్యూచర్‌సిటీ, మచిలీపట్నం గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే, మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టులను ముఖ్యమంత్రి ప్రస్తావించారు. హైదరాబాద్‌లోని హెచ్.ఐ.సి.సి.లో ఆదివారం ప్రధాని చేతుల మీదుగా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరగ్గా...

మిగతా 2లో

తెలంగాణనే తదుపరి టార్గెట్

కాంగ్రెస్, భారాస విఫల వాగ్దానాలతో రాష్ట్ర ప్రజల్లో సహనం నశించింది
ప్రపంచవ్యాప్తంగా ఇంధన విపత్తు నెలకొంది
అందరూ పొదుపుగా వాడుకోవాలి
రసాయన ఎరువుల స్థానంలో సేంద్రియ ఎరువులు వాడాలి
ఏడాదిపాటు ఎవరూ బంగారం కొనొద్దని సూచన
సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ బహిరంగ సభలో ప్రధాని మోదీ

ఈ-కబురు, హైదరాబాద్:
తెలంగాణలో కాంగ్రెస్, భారాస విఫల వాగ్దానాలు, కుటుంబ రాజకీయాలతో ప్రజల్లో సహనం నశించిందని, ఇక్కడి ప్రజలు మార్పు కోరుకుంటున్నారని... ఇక వచ్చేది భాజపా ప్రభుత్వమే అని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. 'భాజపాతోనే వికసిత్ తెలంగాణ సాధ్యమవుతుంది. ఈ రాష్ట్రాన్ని కొత్త ఆలోచనలు, విజన్, సంకల్పంతో నడిపిస్తాం. బెంగాల్ విజయం అనంతరం.. రాష్ట్రంలో భాజపా సర్కార్ వస్తుందని తెలంగాణ వ్యాప్తంగా చెబుతున్నారు' అని పేర్కొన్నారు. తెలంగాణలో భాజపా జెండా ఎగురవేయడమే లక్ష్యంగా ఆదివారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన బహిరంగ సభలో ప్రధాని మాట్లాడారు. దేశం కోసం చనిపోవడమే దేశభక్తి కాదని.. దేశం కోసం జీవించడం, కర్తవ్యం నిర్వహించడమూ దేశభక్తే అవుతుందని అన్నారు. అభివృద్ధిలో భారత్ వేగంగా ముందుకు వెళ్తోందని తెలిపారు.

''పశ్చిమబెంగాల్‌లో తొలిసారి గొప్ప మెజారిటీతో భాజపా సర్కారు అధికారంలోకి వచ్చింది. దేశంలో కాంగ్రెస్ అవినీతిని పెంచి, కుటుంబ పాలన, రాజ్యాంగ సంస్థల గొంతు కోసే ప్రయత్నం చేసింది. టీఎంసీ కాంగ్రెస్ నుంచి ఈ చెడు లక్షణాలు నేర్చుకుంది. లెఫ్ట్ పార్టీల తప్పుడు పనులు చూసి అలవాటు చేసుకుంది. అక్కడ తానాషాహీ నమూనాలో మొత్తం తోడేళ్లను నింపేసింది. ఆ రాష్ట్ర ప్రజలను బానిస తోడేళ్ల మధ్య బంధించింది. ఈ ఎన్నికల్లో ప్రజలు ఆ రాజకీయాలను, తానాషాహీ నమూనాను ఓడించారు. ప్రజలు స్వేచ్ఛావాయువులు పీలుస్తున్నారు. ఈ చరిత్రాత్మక విజయం దేశవ్యాప్త ఉత్సవం అయింది. ప్రపంచ వ్యాప్తంగా చర్చ జరిగింది. ఏ గెలుపుపైనా ఇలాంటి చర్చ జరగలేదు. ఈ ఉత్సాహం తెలంగాణలోనూ కనిపిస్తోంది. దేశంలోని అన్ని ప్రాంతాల్లో భాజపాకు ప్రజాదరణ రోజురోజుకీ పెరుగుతోంది. అభివృద్ధి, సుపరిపాలన చూసి ఓటు వేస్తున్నారు.

అప్పట్లో భాజపాకు తెలంగాణ అండగా నిలిచింది

దేశంలో అస్సాం నుంచి ఒడిశా వరకు.. బెంగాల్ నుంచి పుదుచ్చేరి వరకు ఎన్నికల్లో భాజపా విజయం.. భారత రాజకీయాల్లో పెద్దమార్పు. ప్రజలు వంశవాదం, కుటుంబవాదాన్ని కాదని.. విశ్వాసవాదాన్ని ఎన్నుకుంటున్నారు. భాజపా జెండా ఎత్తేందుకు సిద్ధంగా లేనిచోట.. ఇప్పుడు భాజపా ప్రభుత్వాలు ఏర్పాటవుతున్నాయి. పదేళ్ల క్రితం అస్సాంలో భాజపాకు కొందరే సభ్యులు ఉండేవారు. ఇప్పుడు వరుసగా మూడోసారి భాజపా, ఎన్డీయే సర్కారు వచ్చింది. పదేళ్ల క్రితం బెంగాల్‌లో ముగ్గురే ఎమ్మెల్యేలుండగా ఇప్పుడు ఆ సంఖ్య 200 దాటింది. భాజపాకు గతంలో తెలంగాణ గడ్డ అండగా నిలిచింది.

మిగతా 2లో

..కాంగ్రెస్ లక్ష్యం దేశప్రజలకు సేవ చేయడం కాదు... ప్రజలను విభజించి, వారి మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడమే. అది లెఫ్ట్‌పార్టీల కన్నా అతిపెద్ద మావోవాది. ముస్లిం లీగ్ కన్నా ఎక్కువ కట్టర్ ముస్లిం లీగ్ అయింది. కాంగ్రెస్‌ను ఇప్పుడంతా ఎంఎంసీ అంటున్నారు.. అంటే ముస్లింలీగ్, మావోవాదీ కాంగ్రెస్. దేశంలో 3 రాష్ట్రాల్లోనే కాంగ్రెస్ సీఎంలు ఉన్నారు. ఎక్కడైనా వారిది ఒకటే విధానం. ఎన్నికలకు ముందు ఆకాశం నుంచి చుక్కల్ని తెంపి తీసుకువస్తామంటూ అబద్ధాల హామీలు ఇస్తారు. ఎన్నికలు ముగిశాక మరిచిపోతారు. హిమాచల్, కర్ణాటకలలో ఇచ్చిన హామీలు మరవడంతో అక్కడి ప్రజలు పరేషాన్‌లో ఉన్నారు. తెలంగాణలోనూ అదే పరిస్థితి ఉంది.

ప్రధాని మోదీ

ప్రజాజీవితంలో చాలాకాలం ఉండాలి

మీ ఆరోగ్యం జాగ్రత్త
ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇంటికెళ్లి పలకరించిన ప్రధాని

ఈకబురు, , అమరావతి: 'సుదీర్ఘకాలం మీరు ప్రజాజీవనంలో ఉండాలి. మీపై ఎంతో బాధ్యత ఉంది. రాజకీయాల్లో, ప్రజాజీవనంలో ఉండే మనం ఆరోగ్యాన్ని శ్రద్ధగా కాపాడుకోవాలి' అని ప్రధాని నరేంద్ర మోదీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో అన్నారు. ప్రధాని హైదరాబాద్ పర్యటన సందర్భంగా ఆదివారం జూబ్లీహిల్స్‌లోని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నివాసానికి వచ్చారు. పవన్, ఆయన సతీమణి అనా కొణిదెల ప్రధానికి సాదర స్వాగతం పలికారు.

మిగతా 2లో

03

12న భారాస ముఖ్యనేతలతో కేసీఆర్ సమావేశం

ఈ-కబురు, హైదరాబాద్:
హైదరాబాద్: భారాస అధినేత కేసీఆర్ అధ్యక్షతన ఎర్రవెల్లిలోని ఆయన నివాసంలో ఈ నెల 12న పార్టీ ముఖ్య నేతలతో కీలక సమావేశం నిర్వహించనున్నారు.

ఇంటర్ అడ్మిషన్లు పాత పద్ధతిలోనే..

- పాఠశాల విద్యలో ఇంటర్‌బోర్డు విలీనంపై నిర్ణయం వాయిదా
- సమయం లేకపోవడం.. సంస్కరణలకు మరింత సమయం అవసరం
- దీంతో ఈ ఏడాది పాత పద్ధతిలోనే అడ్మిషన్లు చేపట్టాలని సీఎం నిర్ణయం
- పాఠశాల విద్యాశాఖ అధికారుల సమీక్షలో రేవంత్‌రెడ్డి స్పష్టీకరణ



03

తెలంగాణ ఉద్యమకారుల సంఘాలతో

టీఆర్ఎస్ చీఫ్ కవిత సమావేశం

- తెలంగాణ ఉద్యమకారుల డిమాండ్లకు కవిత మద్దతు
- హామీల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి జూన్ 2 వరకు గడువు

03

నమో నారా భేటీలో.. నవ్వుల సందడి

ప్రధాని మోదీ చేసిన సాయానికి సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు
ఇకపై బరువు తగ్గొద్దంటూ మంత్రి లోకేష్ కు ప్రధాని మోదీ సలహా
మీరే స్ఫూర్తిగా పూర్తి ఫిట్నెస్ సాధిస్తానన్న మంత్రి లోకేష్
పీఎం, ఏపీ సీఎం తేనీటి విందులో సరదా సంభాషణలు, ఆసక్తికర చర్చలు

ఈ-కబురు, హైదరాబాద్ :
ఒకరు దేశానికి ప్రధాన మంత్రి.. మరొకరు సీనియర్ ముఖ్యమంత్రి.. ఇద్దరూ రాజకీయాల్లో మేరు నగధీరులు... గంభీరంగా ఉంటారు. నిత్యం అభివృద్ధిసంక్షేమం, దేశంరాష్ట్రం గురించే వీరి ఆలోచన, తపన. క్షణం తీరికలేని పర్యటనల్లో ఉంటారు. తొలిసారిగా వీరిద్దరూ మధ్య సరదా సంభాషణలతో సమావేశం జరిగింది. హైదరాబాద్ పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు ఇంటికి వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ గంట కుపైగా సమయాన్ని చంద్రబాబు నివాసంలో గడిపారు.

మిగతా 2లో

తమిళ సీఎంగా విజయ్ ప్రమాణం

చెన్నైలో అట్టహాసంగా ప్రమాణ స్వీకారోత్సవం
మంత్రులుగా తొమ్మిది మంది ప్రమాణ స్వీకారం
వాగ్దానాల అమలుకు వేదికపైనే విజయ్ శ్రీకారం
పాలనలో నూతన శకం మొదలైందని ప్రకటన
రాష్ట్రంలో శాంతి భద్రతలపై సీఎం హోదాలో తొలి సమీక్ష
ప్రొటెం స్పీకర్‌గా టీవీకే ఎమ్మెల్యే కరుప్పయ్య ప్రమాణం
నేడు నూతన ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం
రేపు స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎన్నిక
ఉచిత విద్యుత్, మహిళల భద్రత, డ్రగ్స్ కట్టడిపై మూడు సంతకాలు
ప్రజల రుణం తీర్చుకోవడానికొచ్చా.. ప్రజాధనం ముట్టుకోబోనని ప్రతిన

ఈ-కబురు, , చెన్నై:
తమిళనాడులో ద్రవిడ పార్టీల పరిపాలనా పర్వానికి తెరదించుతూ తమిళగ వెట్రి కళగం(టీవీకే) చీఫ్ సి.జోసెఫ్ విజయ్ ఆదివారం నూతన ప్రభుత్వాన్ని కొలువుతీర్చారు. ఆత్మీయులు, కుటుంబసభ్యులు, వేలాది మంది పార్టీ కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో టీవీకే అధ్యక్షుడు విజయ్ తమిళనాడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. గత 60 ఏళ్ల తమిళనాడు చరిత్రలో డీఎంకే, అన్నాడీఎంకే ప్రమేయం లేని ప్రభుత్వం అధికారంలోకి రావడం ఇదే తొలిసారి.

మిగతా 2లో

ఉర్విల్ పటేల్ విధ్వంసం.. లఖ్‌నవూపై చెన్నై విజయం

06

తమిళ సీఎంగా
విజయ్ ప్రమాణం

చెన్నైలోని నెహ్రూ ఇండోర్ స్టేడియంలో ఉదయం 10.15 గంటలకు అట్టహాసంగా ప్రమాణ స్వీకారోత్సవం ఆరంభమైంది. విజయ్‌తో గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ ముఖ్యమంత్రిగా ప్రమాణంచేయించారు. టీవీకేలోని 9 మంది నేతలు మంత్రులుగా ప్రమాణంచేశారు. టీవీకే ప్రభుత్వంలో కాంగ్రెస్ పార్టీ సైతం భాగస్వామిగా చేరిన నేపథ్యంలో ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ తరపున ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రత్యేకంగా హాజరయ్యారు.

ముఖ్యమంత్రి విజయ్ తల్లిదండ్రులు ఎస్.ఎ.చంద్రశేఖర్, శోభ, తమిళనాడులో బీజేపీ నాయకురాలు తమిళిసై సౌందరరాజన్, సినీ నటి త్రిష, వామపక్ష పార్టీల రాష్ట్ర ముఖ్యనేతలు ముందువరసలో కూర్చుని ప్రమాణస్వీకారాన్ని చూశారు. పలువురు ప్రముఖులు, తమిళ సినీతారలు, టీవీకే నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

అభిమానుల 'విజిల్' మోతలు, 'సీఎం విజయ్', 'దళపతి' నినాదాలతో ఇండోర్ స్టేడియం మార్మోగిపోయింది. విజయ్ తన మంత్రివర్గంలో యువత, అనుభవజ్ఞులకు ప్రాధాన్యమిచ్చారు. సీఎంగా ప్రమాణంచేశాక విజయ్ ఉద్వేగంగా ప్రసంగించారు. నిజమైన లౌకికవాదం, సామాజిక న్యాయానికి కట్టుబడి ఉండే పాలనకు సంబంధించిన నూతన శకం ఇప్పుడే ప్రారంభమైందని స్పష్టంచేశారు.

తనదైన శైలిలో ప్రమాణం చేయబోయి..

విజయ్‌తో సీఎంగా ప్రమాణం చేయించేందుకు ఆయనను పోడియం వద్దకు గవర్నర్ ఆహ్వానించారు. 'నేను' అని గవర్నర్ అందివ్వగా అధికారికంగా ఇచ్చిన ప్రమాణపత్రాన్ని కాదని సొంతంగా తనదైన శైలిలో ప్రమాణంచేసేందుకు విజయ్ ప్రయ త్నించారు. వెంటనే గమనించిన గవర్నర్ సున్నితంగా అడ్డుకుని రాజ్యాంగంలో పేర్కొన్న శైలిలోనే ప్రమాణం చేయాలని సూచించారు.

తొలి రోజే వివాదం

ప్రమాణ స్వీకారోత్సవంలో గాయకులు వందే మాతరంలోని మొత్తం ఆరు చరణాలను ఆలపించడం విశేషం. సాధారణంగా అధికారిక కార్యక్రమంలో మొదటి రెండు చరణాలను ఆలపిస్తారు. అయితే, మొత్తం ఆరు చరణాలను ఆలపించాలంటూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. ప్రమాణ స్వీకార వేడుకలో తమిళ తల్లి గీతం.. తమిళ్ తాయ్ వాత్తుకు మూడో స్థానం కల్పించడాన్ని సీపీఐ, డీఎంకేలు తీవ్రంగా పరిగణించాయి.

వందేమాతరం, జనగణమన అనంతరం తమిళ్ తాయ్ వాత్తు గీతాన్ని ఆలపించారు. ప్రాధాన్యతా క్రమంలో తమిళ గీతానికి మూడోస్థానం కల్పించడంపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎం.వీరపాండియన్, వీసీకే అధినేత థోల్ తిరుమావళవన్‌తోపాటు సీపీఎం, ఐయూఎంఎల్ నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. అసెంబ్లీలో ఇది పునరావృతం కాకుండా చూసుకోవాలని, తమిళ తల్లి గీతానికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్‌చేశారు. అధికారిక కార్యక్రమాల్లో తమిళ తల్లి గీతాన్ని మొదట ఆలపించడం సంప్రదాయమని పీఎంకే వ్యవస్థాపకుడు ఎస్.రాందాస్ గుర్తుచేశారు.

వేదికపై 3 సంతకాలు

ప్రజలకు ఇచ్చిన 3 వాగ్దానాల అమలుకు ప్రమాణ స్వీకార వేదికపైనే విజయ్ శ్రీకారం చుట్టారు. గృహ వినియోగదారులకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌కు సంబంధించిన ఫైల్‌పై తొలి సంతకం చేశారు. మహిళల భద్రత కల్పించడానికి మహిళలతో 'సింగా పెన్' పేరిట ప్రత్యేక దళాన్ని ఏర్పాటు చేస్తూ మరో ఫైల్‌పై సంతకం చేశారు. రాష్ట్రంలో మాదక ద్రవ్యాల మహమ్మారిని అరికట్టడమే లక్ష్యంగా మాదకద్రవ్యాల అక్రమ రవాణా దళం ఏర్పాటు కోసం మరో ఫైల్‌పై సంతకం చేశారు. తమకు మద్దతు ఇచ్చిన కాంగ్రెస్, వీసీకే, ఐయూఎంఎల్, వామపక్షాలకు కృతజ్ఞతలు తెలియజేశారు. యువత, టీనేజర్లు, చిన్నారులకు విజయ్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అత్యంత సీనియర్ నేత కె.ఎ.సెంగోట్టయన్, యువనేత డాక్టర్ కె.టి.ప్రభు, మహిళా నాయకురాలు ఎస్.కీర్తన, ఆధవ్ అర్జున, ఎన్. ఆనంద్, ఆర్.నిర్మల్ కుమార్, కె.జి.అరుణ్‌రాజ్, ఎ.రాజ్ మోహన్, పి.వెంకటరమణన్‌లు ప్రమాణంచేసి మంత్రివర్గంలో చేరారు.

నేనొక్కడినే పవర్ సెంటర్

ముఖ్యమంత్రిగా ప్రమాణంచేసిన విజయ్ వేదికపై తనదైన శైలిలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ''నా గుండెల్లో నివసించే అభిమానులందరికీ వందనాలు. నేను రాజరిక కుటుంబం నుంచి రాలేదు., సినిమాల్లో రాణించాలని కష్టపడిన ఒక సాధారణ అసిస్టెంట్ డైరెక్టర్ కుమారుడిని. ఆకలి, పేదరికం అంటే నాకు బాగా తెలుసు. అందుకే ప్రజలను నా సొంత కుటుంబ సభ్యులుగా భావిస్తా. తమిళప్రజలు నన్ను సొంత బిడ్డలా, అన్నగా, తమ్ముడిగా ఆదరించి సినిమాల్లో గొప్ప స్థానాన్ని ఇచ్చారు. ఆ రుణం తీర్చుకోవడానికే రాజకీయాల్లోకి వచ్చా. ప్రజల ఆశీస్సులతో ఈ పదవిలోకి వచ్చా. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా మారింది. తమిళనాడు ప్రస్తుతం రూ.10 లక్షల కోట్ల అప్పుల్లో ఉంది. గత ప్రభుత్వం ఖజానాను ఖాళీ చేసి, మోయలేని భారాన్ని మనపై వదిలివెళ్లింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై త్వరలోనే శ్వేతపత్రం విడుదల చేస్తాం.

మా ప్రభుత్వం చీకటి ఒప్పందాలు చేయదు. రహస్యంగా ఎవర్నీ కలవదు. ఏది చేసినా ప్రజల సాక్షిగా బహిరంగంగానే చేస్తాం. ప్రజల సొమ్ము నుంచి ఒక్క రూపాయి కూడా ముట్టుకోను. నేను తప్పు చేయను. ఎవరినీ చేయనివ్వను. నా ప్రభుత్వంలో అధికారులైనా, మంత్రులైనా ఎవరైనా ఒకే మాట మీద నడవాలి. ఇక్కడ పవర్ సెంటర్లు ఉండవు. అంతా నా నాయకత్వంలోనే నడుస్తుంది. నేనే ఏకైక పవర్ సెంటర్.

గెలవగానే ఆటలు ఆడదాం అనుకునే ఆలోచన ఎవరికైనా ఉంటే ఇప్పుడే ఆ ఆలోచన మానుకోండి. హిందూ, ముస్లిం, క్రైస్తవ సోదరులందరి కోసం సమప్రాధాన్యంతో పరిపాలిస్తా. హామీల అమలుకు కొంత సమయం ఇవ్వండి. నేను దేవదూతను కాదు. సాధారణమైన వ్యక్తిని. విద్యార్థుల కోసం విజయ్ మామ మంచి పనులు చేస్తాడు. భవిష్యత్తులో నాకు అడ్డంకులు సృష్టించే వారు కూడా నాకు శ్రేయోభిలాషులే'' అని విజయ్ వ్యాఖ్యానించారు.

దేవుడి పేరిట ప్రమాణం

ప్రమాణ స్వీకారంలో దళపతి విజయ్ సరికొత్త ఆహార్యంతో ఆకట్టుకున్నారు. సాధారణంగా నిత్యం ధరించే తెల్లచొక్కా, ఖాకీ రంగు ప్యాంటు కాకుండా ముదురు రంగు ప్యాంటు, తెల్లచొక్కా, దానిపై నలుపురంగు సూట్ ధరించారు. విజయ్ సహా మంత్రులందరూ దేవుడి పేరిట ప్రమాణం చేయడం విశేషం. రాహుల్ గాంధీ తోపాటు కేబినెట్ సహచరులతో, పార్టీ నాయకులతో విజయ్ సెల్ఫీలు దిగారు. గవర్నర్‌తో గ్రూప్ ఫొటో సందర్భంగా వేదికపై అడ్డుగా ఉన్న పెద్ద బల్లను పక్కకు తీసుకెళ్లాల్సి వచ్చింది. ఈ సందర్భంగా విజయ్ సైతం బల్లను పట్టుకుని పక్కకు తీసుకెళ్లారు. శాసనసభ తొలి సమావేశం సోమవారం ఉదయం ప్రారంభం కానుంది. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు సభలో ప్రమాణం చేస్తారు. టీవీకే ఎమ్మెల్యే కరుప్పయ్య ప్రొటెం స్పీకర్‌గా ఆదివారం లోక్‌భవన్‌లో ప్రమాణం చేశారు.

తిరుచ్చి ఈస్ట్ ఎమ్మెల్యేగా రాజీనామా

అసెంబ్లీ ఎన్నికల్లో పెరంబూర్‌తోపాటు తిరుచ్చి ఈస్ట్ నుంచి విజయ్ ఎమ్మెల్యేగా గెలిచారు. నిబంధనల ప్రకారం ఒక స్థానాన్ని వదులుకోవాల్సి ఉండగా, తిరుచ్చి ఈస్ట్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. ఇకపై పెరంబూర్ ఎమ్మెల్యేగానే ఆయన కొనసాగుతారు. ఈ మేరకు అసెంబ్లీ ప్రిన్సిపల్ సెక్రెటరీకి లేఖ పంపించారు. తిరుచ్చి ఈస్ట్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశాకే విజయ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.

మొదటిసారిగా సచివాలయానికి రాక

ప్రమాణ స్వీకారం తర్వాత సీఎం విజయ్ సచివాలయానికి చేరుకున్నారు. అనంతరం సీఎం చాంబర్‌లో విజయ్ ఆసీనులయ్యారు. కొన్ని అధికారిక పత్రాలపై సంతకాలు చేశారు. సీఎం హోదాలో తొలి సమీక్షా సమావేశం నిర్వహించారు. మహిళ భద్రతకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. డ్రగ్స్ కేసుల్లో దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

తెలంగాణనే తదుపరి టార్గెట్

అప్పట్లో భాజపాకు తెలంగాణ అండగా నిలిచింది దేశంలో అస్సాం నుంచి ఒడిశా వరకు.. బెంగాల్ నుంచి పుదుచ్చేరి వరకు ఎన్నికల్లో భాజపా విజయం.. భారత రాజకీయాల్లో పెద్దమార్పు. ప్రజలు వంశవాదం, కుటుంబవాదాన్ని కాదని.. విశ్వాసవాదాన్ని ఎన్నుకుంటున్నారు. భాజపా జెండా ఎత్తేందుకు సిద్ధంగా లేనిచోట.. ఇప్పుడు భాజపా ప్రభుత్వాలు ఏర్పాటవుతున్నాయి. పదేళ్ల క్రితం అస్సాంలో భాజపాకు కొందరే సభ్యులు ఉండేవారు. ఇప్పుడు వరుసగా మూడోసారి భాజపా, ఎన్డీయే సర్కారు వచ్చింది. పదేళ్ల క్రితం బెంగాల్‌లో ముగ్గురే ఎమ్మెల్యేలుండగా ఇప్పుడు ఆ సంఖ్య 200 దాటింది. భాజపాకు గతంలో తెలంగాణ గడ్డ అండగా నిలిచింది. అప్పట్లో లోక్‌సభలో పార్టీ ఎంపీలు ఇద్దరు ఉంటే.. అందులో ఒకరు తెలంగాణ నుంచి ఉన్నారు. ఇప్పుడు ఎనిమిది మంది ఉన్నారు. తెలంగాణలో భారీ మెజార్టీతో భాజపా సర్కారు ఏర్పాటవుతుందన్న నమ్మకం పార్టీ కార్యకర్తల్లో, ప్రజల్లో వచ్చింది.

చివరి శ్వాస తీసుకుంటున్న మావోవాదం

దేశంలో మావోయిస్టుల కారణంగా చాలా నష్టం జరిగింది. కాంగ్రెస్, లెఫ్ట్‌పార్టీలు వారికి తెరవెనుక సహాయం చేయడంతో ఏళ్ల పాటు వారి ఆగడాలు సాగాయి. ఇప్పుడు భాజపా హయాంలో మావోవాదం చివరి శ్వాస తీసుకుంటోంది. తెలంగాణ ఈ సమస్య నుంచి విముక్తి పొందుతోంది. గత 11, 12 ఏళ్లుగా కాంగ్రెస్ కూటమి మావోయిస్టులపై చర్యలు తీసుకోకుండా కాపాడే ప్రయత్నం చేసింది. తెలంగాణలో పోలీసులకు స్వేచ్ఛ ఇస్తే.. శక్తిని చూపేందుకు అవకాశమిస్తే ఎప్పుడో మావోయిస్టుల ఆటలకు అడ్డుకట్టపడేది.

ఇంధన భారాన్ని సర్కారు భుజాలపై వేసుకుంది

ప్రపంచ వ్యాప్తంగా ఇంధన విపత్తు నెలకొంది. ఇరాన్‌అమెరికా యుద్ధంతో నెలకొన్న ఇంధన విపత్తు నుంచి బయటపడేందుకు భారత ప్రభుత్వం రెండు నెలలుగా ప్రయత్నాలు చేస్తోంది. ఈ ప్రభావం భారత్‌పై ఎక్కువే ఉంది. మన వద్ద చమురు నిల్వ చేసేందుకు పెద్దపెద్ద బావులు లేవు. ఎప్పటికప్పుడు అవసరాల మేరకు విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్, ఎరువుల ధరలు పెరిగి.. ఆకాశాన్ని దాటాయి. ప్రజలపై ఇంధన భారం వేయకుండా ఆ భారాన్ని సర్కారు భుజాలపై వేసుకుంది. ఈ విపత్తు నుంచి బయటపడేందుకు ఎన్ని ఉపాయాలు చేస్తున్నా సమస్యలు పెరుగుతూనే ఉన్నాయి. ఈ సమస్య కేంద్ర ప్రభుత్వానిదో.. భాజపాదో లేదా ఇతర రాజకీయ పార్టీలదో, వ్యక్తిదో కాదు.. ఇది దేశ సమస్య. ప్రజలు, రాజకీయపార్టీలు, ప్రభుత్వాలు, సమాజాలన్నీ ఈ విపత్తుపై సంకల్పం తీసుకోవాలి. ఈ సమస్య నుంచి బయటపడేలా సమన్వయంతో ముందుకెళ్లాలి.

వర్క్ ఫ్రం హోమ్.. ఆన్‌లైన్ సమావేశాలు..

పెట్రోల్, డీజిల్ దిగుమతి చేయాలంటే భారీగా విదేశీమారకద్రవ్యం ఖర్చుపెట్టాలి. ఈ ఖర్చును తగ్గించాలంటే మనం తీసుకునే చిన్నచిన్న చర్యలతో దేశానికి మేలు చేయవచ్చు. దేశ ప్రజలంతా ఇంధన పొదుపు చేయాలి. మెట్రో రైలు సౌకర్యం ఉంటే.. అందులోనే వెళ్లాలి. కారులో వెళ్లాలంటే కార్‌పూల్ చేసుకుని, ఇతరులను కూర్చోబెట్టుకోవాలి. ఎలక్ట్రిక్ వాహనాలున్నవారు.. వాటిని ఉపయోగించాలి. కరోనా సమయంలో వర్క్ ఫ్రం హోమ్, ఆన్‌లైన్ సమావేశాలు, వీడియో కాన్ఫరెన్సులు అలవాటయ్యాయి. ఇప్పుడు మరోసారి ఉపయోగించాల్సిన అవసరముంది. విదేశాల్లో వివాహాలు, విదేశీ పర్యటనలు మధ్యతరగతి కుటుంబాల్లో పెరిగాయి. ఈ విపత్తు కాలంలో దేశభక్తి నిరూపించుకునేందుకు ఆయా వేడుకలను విదేశాల్లో కాకుండా.. భారత్‌లో నిర్వహించాలి.

ఐదారేళ్లుగా సప్లై చైన్‌కు ఆటంకం...

కరోనా, ఉక్రెయిన్ యుద్ధం, ఇరాన్‌అమెరికా యుద్ధంతో ప్రపంచవ్యాప్తంగా సప్లై చైన్ సమస్యలు పెరిగాయి. ఐదారేళ్లుగా వరుసగా వస్తున్న ఈ విపత్తుల నుంచి బయటపడేందుకు నిరంతరం ప్రయత్నాలు చేస్తున్నాం.

సప్లైచైన్ సమస్యలు ఎన్ని ఉన్నా ప్రపంచ వ్యాప్తంగా ఫర్టిలైజర్ బస్తా రూ.3 వేలు ఉంటే.. దేశంలోని రైతులకు రూ.300కే ఇస్తున్నాం

ప్రజాజీవితంలో చాలాకాలం ఉండాలి

పవన్ ఆయన చేయిపట్టుకుని ఇంట్లోకి తోడ్కొని వెళ్లారు. ఇటీవల శస్త్రచికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న పవన్‌ను అందుకు కారణాలేమిటని ప్రధాని ఆరా తీశారు. 'కొన్నేళ్లుగా చేసిన పర్యటనల్లో రేగిన దుమ్ము, ధూళి సైనస్‌లోకి చేరాయి. అవి ఒక గట్టి బాల్ మాదిరిగా మారిపోయి ఇబ్బంది కలిగించాయి. ఇన్‌ఫెక్షన్ అయింది. కంటిపైనా ప్రభావం చూపింది. దీంతో ఫంక్షనల్ ఎండోస్కోపిక్ సైనస్ సర్జరీ చేశారు' అని పవన్ వివరించారు. ఇంకా ఏమైనా ఆరోగ్య సమస్యలున్నాయా అని మోదీ అడిగారు. 'గతంలో సినిమా షూటింగ్‌ల సమయంలో భుజాల దగ్గర కండరాలకు తగిలిన గాయాలు ఇప్పుడు ఇబ్బంది పెడుతున్నాయి. రొటేటర్ కఫ్ ఇంజురీ అని వైద్యులు చెప్పారు. వాటికీ శస్త్రచికిత్సలు అవసరం. స్పైనల్ కార్డుకు సంబంధించి సమస్య ఉంది' అని పవన్ చెప్పారు. 'మీరు ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయొద్దు. సమాజానికి మీరు చేయాల్సింది ఎంతో ఉంది' అంటూ మోదీ ఆయనకు పలు ఆరోగ్య సూచనలు చేశారు.

మార్క్.. నీ గురించి ఎంతో కంగారుపడ్డాం

పవన్ చిన్న కుమారుడు మార్క్ శంకర్ ప్రధానికి తాను తయారు చేసిన స్వాగత కార్డు, ధన్యవాదాల కార్డు అందించారు. మోదీ ఆ బాబును దగ్గరకు తీసుకున్నారు. 'నీ కోసం అప్పుడు ఎంత కంగారుపడ్డామో తెలుసా' అంటూ గతంలో సింగపూర్‌లో వేసవి శిక్షణ శిబిరంలో అగ్నిప్రమాదంలో అతను చిక్కుకున్న క్షణాలను గుర్తు చేసుకున్నారు. తర్వాత పవన్ సతీమణి అనా కొణిదెలతో ప్రధాని మాట్లాడారు. వీరి మధ్య కొన్ని రష్యన్ పదాలు కూడా దొర్లాయి. ప్రధానిగా తాను ప్రమాణస్వీకారం చేసినప్పుడు పవన్‌తో పాటు అనా వచ్చిన సందర్భాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు.

అకీరా.. ఏం చేస్తున్నావ్?

తర్వాత పవన్ కుమారుడు అకీరానందన్‌తో ప్రధాని మాట్లాడారు. ఏం చేస్తున్నావని అడగ్గా మార్షల్ ఆర్ట్స్ నేర్చుకుంటున్నట్లు అకీరా చెప్పారు. మీ నాన్నలా నువ్వు కూడా అదే వైపు ఎందుకు, వేరే ప్రయత్నించాల్సింది కదా అని మోదీ వ్యాఖ్యానించారు. స్పోర్ట్స్, షూటింగ్ అంశాల్లోనూ శిక్షణ తీసుకుంటున్నానని అకీరా చెప్పారు. ప్రఖ్యాత హిందీ కవి రాంధారి సింగ్ దినకర్ కవిత్వాన్ని అకీరా ప్రధానికి వినిపించి ఆ అర్థం కూడా హిందీలోనే విశ్లేషించి చెప్పారు. ఆ హిందీ కఠినమైనదని, అది చెప్పడంతో పాటు దాని అర్థం కూడా అంతే చక్కని హిందీలో వివరించినందుకు ప్రధాని సంతోషం వ్యక్తం చేశారు. పవన్ కుమార్తె ఆద్యతోనూ మాట్లాడారు. ఆద్య అమ్మమ్మకు గుజరాతీ మూలాలున్నాయి. వీరి మధ్య అందుకు సంబంధించి కొద్దిసేపు చర్చ జరిగింది. పవన్ మరో కూతురు పొలినా అంజనాతో ప్రధాని ఇంగ్లిష్‌లో మాట్లాడారు. హిందీ తెలియదా అని ప్రశ్నించారు. 'మళ్లీ మనం కలిసేనాటికి పొలినా, అనా కొణిదెల కూడా హిందీలో మాట్లాడాలి' అని అన్నారు.

పవన్ ఇంటికి వెళ్లా: ప్రధాని మోదీ

'హైదరాబాద్‌లో ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ నివాసానికి వెళ్లాను. ఆయనతో పాటు వారి కుటుంబసభ్యులను కలిశాను. పవన్ ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నా. ఆయన ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించా' అని ప్రధాని మోదీ ఆదివారం ఎక్స్‌లో పేర్కొన్నారు.

జీవితాంతం గుర్తుంటుంది: పవన్ కల్యాణ్

ప్రధాని స్వయంగా తన ఇంటికి వచ్చి పరామర్శించడం పట్ల పవన్ కల్యాణ్ 'ఎక్స్'లో కృతజ్ఞతలు తెలిపారు. ప్రధాని వ్యక్తిగతంగా వచ్చి చూపిన ఆప్యాయత తనకు జీవితాంతం గుర్తుంటుందన్నారు. 'నా నివాసానికి ప్రధాని రావడం గొప్ప అనుభూతిని కలిగించింది. నా సతీమణి అనా కొణిదెల, మా పిల్లలు అకీరానందన్, ఆద్య, పొలినా అంజనా, మార్క్ శంకర్‌లతో కలిసి ప్రధానికి సాదరంగా స్వాగతం పలికే గొప్ప గౌరవం దక్కింది. నా ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకోవడానికి విచ్చేయడం ప్రధానిలోని ఆప్యాయత, అనురాగాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ప్రధాని మాతో గడిపిన విలువైన సమయానికి నేను చలించిపోయాను' అని ఎక్స్‌లో పేర్కొన్నారు.

నమో నారా భేటీలో.. నవ్వుల సందడి

ఈ సందర్భంగా ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ మధ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆసాంతం నవ్వులు విరిశాయి. సీఎం చంద్రబాబు నివాసంలోకి అడుగు పెడుతుండగానే... ఓ ఫొటో చూసిన ప్రధాని ఏడాది క్రితం అనుభాలను గుర్తు చేసుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా సరిగ్గా ఏడాది క్రితం యువగళం కాఫీ టేబుల్ బుక్ ఆవిష్కరణ ఢిల్లీలో చేయించారు మంత్రి నారా లోకేష్. అప్పటి ఫోటోను ఫ్రేమ్ చేయించి.. అందులో యువగళం కాఫీ టేబుల్ బుక్ కూడా భద్రపరిచారు. ఇది సీఎం చంద్రబాబు ఇంట్లోకి వెళ్లే ముందు కనిపిస్తుంది. ప్రధాని మోదీ ఆ ఫొటోను చూసి నాటి సంగతులను గుర్తు చేసుకున్నారు. ఈ పుస్తకాన్ని ప్రధాని మోదీ ఆవిష్కరించి ఏడాది పూర్తైందని... యాధృచ్చికంగా ప్రధాని తమ ఇంటికి వచ్చారంటూ ప్రధాని మోదీకి నాటి సంఘటనలను లోకేష్ గుర్తు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ సీఎం చంద్రబాబు ఇంటిలోని రామమందిరం వద్ద పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాముల విగ్రహాలు దశాబ్దాల క్రితం నాటివని... ఆ పంచలోహ విగ్రహాలను నందమూరి తారకరామారావు గారు తమకు ఇచ్చారని సీఎం చంద్రబాబు ప్రధాని మోదీకి వివరించారు.

అన్నింటిలోనూ ప్రధానే ఆదర్శం...

చంద్రబాబు నివాసంలో ప్రధానితో సమావేశం సందర్భంగా రాష్ట్రాభివృద్ధికి కేంద్రం, ప్రధాని నరేంద్ర మోదీ చేస్తున్న సాయానికి సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. ఇక ఈ సమావేశంలో లోకేష్ ఫిట్నెస్ పై ఆసక్తికర సంభాషణ జరిగింది. లోకేష్ ఇలా స్లిమ్‌గా, ఫిట్‌గా మారడానికి ప్రధాని మోదీనే కారణమని ముఖ్యమంత్రి తెలిపారు. తొలిసారి ప్రధానితో భేటీ అనంతరం లోకేష్ ఫిట్నెస్, డైట్ పై శ్రద్ధ పెట్టారని సీఎం చంద్రబాబు ప్రధానికి చెప్పారు. లోకేష్ ఇంకా బరువు తగ్గాల్సిందంటూ మోదీ సలహా ఇచ్చారు. ఫిట్నెస్ విషయంలో మీరే స్ఫూర్తి అని... మరింత ఫిట్ గా మారతానని లోకేష్ ప్రధానితో చెప్పారు. దేశం కోసం క్షణం తీరికలేకుండా పనిచేస్తున్నారని, 75 ఏళ్ల వయస్సులో ప్రధాని పాటించే ఆరోగ్య సుత్రాలు, శారీరక ధృఢత్వం వంటివి తనకు స్ఫూర్తి అని మంత్రి లోకేష్ ప్రధానితో చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ పని విధానం చూస్తుంటే... 25 ఏళ్ల వయస్సున్న ముగ్గురు యువకులు ప్రధానిలో ఉన్నట్టు చురుగ్గా పని చేస్తారని ఈ సందర్భంగా లోకేష్ అన్నారు.

నాకు ఇద్దరు మెంటార్లు..

ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు ఇద్దరూ తనకు మెంటార్లే ఈ సమావేశంలో మంత్రి నారా లోకేష్ చెప్పారు. రాజకీయాల్లోనూ, అభివృద్ధిలోనూ, ప్రజా సంక్షేమంలోనూ దేశంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు తనకు మార్గదర్శకులని... ఇద్దరూ తనకు మెంటార్లేనని, గురువులుగా వారిని అనుసరిస్తానని లోకేష్ అన్నారు. అంకితభావంతో, సేవా ధృక్పథంతో భావితరాల కోసం నిస్వార్థంగా పని చేసే మోదీ, చంద్రబాబుల స్పీడ్ అందుకోవాలనే తన కల సాకారం కావాలని కోరుకుంటున్నాన్నారు. ప్రధాని నరేంద్ర మోదీని ఎప్పుడు కలిసినా తన నియోజకవర్గం మంగళగిరి చేనేత శాలువాతో సత్కరించడం నారా లోకేష్ ఆనవాయితీగా పెట్టుకున్నారు. మంగళగిరి చేనేత శాలువాతో ప్రధానిని సత్కరించి లోకేష్.. మంగళగిరి చేనేత విశిష్టతను ప్రధానికి వివరించారు.

మా ప్రాజెక్టులపై దృష్టి పెట్టండి

ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడారు. 'పదేళ్లలో తెలంగాణను దేశానికి రోల్ మోడల్‌గా నిలబెడతాం. నాటి ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ సహకారంతో ముఖ్యమంత్రిగా మీరు గుజరాత్ మోడల్‌ను అభివృద్ధి చేశారు. ఆయన స్ఫూర్తితో మీరు నాకు పూర్తి సహకారం అందిస్తారని విశ్వసిస్తున్నా. ఆయన నాడు గుజరాత్‌కు ఎలా సహకరించారో, ఇప్పుడు తెలంగాణకు మీరు చేయూతనివ్వండి. గుజరాత్‌కు ఇచ్చినట్లుగా తెలంగాణకు నిధులు ఇవ్వండి' అని ప్రధాని మోదీని కోరారు. ''ఎన్నికలప్పుడు మాత్రమే రాజకీయాలు. ఎన్నికలయ్యాక అందరి దృష్టి అభివృద్ధిపైనే. ఇది కేంద్ర సర్కార్ కార్యక్రమం కాదు.. వికాస్ ఉత్సవం.. తెలంగాణ వికాస్ ఉత్సవం. తెలంగాణ వికసిస్తే దేశం వికసిస్తుంది' అని సీఎం రేవంత్ అన్నారు. ''దేశం విషయంలో మీతో మేం కలిసే ఉన్నాం. మీరు వికసిత్ భారత్ 2047 రూపొందించి భారత్‌ను 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడానికి శ్రీకారం చుడితే, మేము తెలంగాణ రైజింగ్ 2047తో పని చేస్తున్నాం. తెలంగాణ 2034 నాటికి ట్రిలియన్ డాలర్ ఎకానమీ, 2047 నాటికి త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీ సాధించడానికి కేంద్రం సహకరించాలి. ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు పూర్తవగానే తెలంగాణకు వచ్చారు. రాజకీయాలు మాట్లాడం. మనం అభివృద్ధిపై దృష్టి సారించాలి. తెలంగాణను మొదటి స్థానంలో నిలిపేందుకు మేం ప్రయత్నిస్తున్నాం. దేశ జనాభాలో 3 శాతం కంటే తక్కువగా ఉన్న తెలంగాణ.. జీడీపీలో 5 శాతం సమకూరుస్తోంది. 2047 నాటికి ఇది 10 శాతంగా ఉండాలన్న లక్ష్యానికి కేంద్రం అన్ని విధాలా సహకరించాలి'' అని ప్రధాని మోదీకి సీఎం రేవంత్ విజ్ఞప్తి చేశారు.

హైదరాబాద్ సహా ఆరు నగరాలది కీలక పాత్ర

దిల్లీ, ముంబయి, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, హైదరాబాద్ నగరాలకు సంబంధించిన ప్రాజెక్టులకు త్వరితగతిన క్లియరెన్స్ కోసం ప్రధానమంత్రి కార్యాలయంలో ప్రత్యేక సింగిల్ విండో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రధానికి సూచించారు. ఈ ఆరు నగరాలు జాతీయ ప్రాధాన్యం కలిగి ఉన్నాయని, కీలక ప్రాజెక్టులకు వేగంగా అనుమతి ఇవ్వాల్సి ఉందని పేర్కొన్నారు. ''జాతీయ భద్రత, జాతీయ అభివృద్ధే మనకు అత్యంత ప్రాధాన్యమైనవి. ముందు భారతదేశం.. తర్వాత ప్రజలు.. ఆ తర్వాతే పార్టీ అనేది స్పష్టం. ఆ స్ఫూర్తితోనే దేశ నిర్మాణానికి మీరు వికసిత్ భారత్ 2047ను ప్రకటించినప్పుడు, మేము భాగస్వాములమయ్యాం. తెలంగాణ రైజింగ్‌కు మీరు పూర్తి సహకారం అందిస్తారనే విశ్వాసం మాకు ఉంది'' అని ప్రధాని మోదీని ఉద్దేశించి రేవంత్ అన్నారు.

కులాలకు, ప్రాంతాలకు అతీతంగా హిందువులు ఏకమవ్వాలి : వీరధర్మజ స్వామి

- హిందుత్వం ఉంటేనే దేశం నిలబడుతుంది: : ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి
- గోపినగర్ లో వైభవంగా హిందూ మహా సమ్మేళనం

ఈకబురు, శేరిలింగంపల్లి : కులాలకు, ప్రాంతాలకు అతీతంగా హిందువులు ఏకమవ్వాలని, భారతదేశం లో ప్రత్యేకంగా హిందూ సమ్మేళనాలు చేసుకోవాల్సిన పరిస్థితికి హిందువులు చేరుకోవడం బాధాకరమని వీరధర్మజ స్వామి ఆవేదన వ్యక్తం చేశారు.

శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని గోపినగర్ బీసీ హాస్టల్ ప్రాంగణంలో హిందూ మహా సమ్మేళనం వైభవంగా జరిగింది. గోపినగర్, బాపూనగర్, నెహ్రూ నగర్, ప్రశాంత్ నగర్, ఆదర్శ్ నగర్, డోయన్స్ కాలనీ, సుదర్శన్ నగర్, భాగ్యలక్ష్మి నగర్, ఆలిండ్ సొసైటీలకు చెందిన దాదాపు 3వేల మంది హిందువులు ఈ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి దాతలుగా వ్యవహరించిన స్థానిక తాజా మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, కాంటెస్టెడ్ కార్పొరేటర్లు కర్చర్ల ఎల్లేష్, మారబోయిన రవి యాదవ్, బిఆర్ఎస్ నాయకుడు పొట్ట నరేందర్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు చింతకింది రవీందర్ గౌడ్, ఆస్ట్రేలియా లో ఎంపీగా పోటీ చేసిన ప్రముఖ బిల్డర్ నిఖిల్ రెడ్డి, సాయి జ్యోతి కన్స్ట్రక్షన్స్ అధినేత రమణమూర్తి, ప్రచార రథం సమకూర్చిన దొంతి సత్యనారాయణ గౌడ్ లను హిందూ సమ్మేళనం కార్యచరణ కమిటీ ఘనంగా సత్కరించింది. అనంతరం ముఖ్యఅతిథి, సిద్దిపేట జిల్లా వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం పీఠాధిపతులు విశ్వబ్రహ్మ శ్రీ వీరధర్మజ స్వామి మాట్లాడుతూ కుల ప్రాంత వర్గ వర్ణ రాజకీయాల కారణంగా హిందువుల్లో ఐక్యత దెబ్బతింటున్నదని అన్నారు. సమస్య తన వరకు వస్తే తప్ప హిందువుల్లో చైతన్యం రాని పరిస్థితిలు నెలకొన్నాయని అన్నారు. లవ్ జిహాద్ నుండి మన హిందూ యువతులను రక్షించుకోవాల్సిన బాధ్యత కుటుంబ సభ్యులపైనే ఉందని సూచించారు.

గోపినగర్ లోని గోవర్ధనగిరి పై శ్రీరాముని భవ్య మందిర నిర్మాణాన్ని చేపట్టాలని, తన వంతు బాధ్యతగా కోటి రూపాయల విరాళాలను సేకరిస్తానని బస్తీ వాసులకు వారు అభయమిచ్చారు. అనంతరం ముఖ్యవక్త, ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పూర్వ అధిపతి, టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ పూర్వ కార్యదర్శి ఆచార్య కసిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. హిందుత్వం ఉంటేనే దేశం నిలబడుతుందని అన్నారు. నిరాశ, నిస్పృహలకు లోను కాకుండా అఖండ భారత దిశగా అడుగులు వేయాలని, ఓపికతో పోరాడితే ఏదైనా సాధ్యమని అన్నారు. సీనియర్ జర్నలిస్టు దేవికా రెడ్డి మాట్లాడుతూ

.. పసిప్రాయం నుంచే పిల్లలకు సద్బుద్ధులు నేర్పాలని, ఆడపిల్లలకు మన హిందూ సాంప్రదాయం ప్రకారం కట్టు బొట్టు ఉండేటట్టు చూడాలన్నారు. సమ్మేళనం లో భాగంగా నాట్య కుసుమ డాన్స్ అకాడమీ గురువు లక్కాకుల సుమలత శిష్య బృందం కూచిపూడి నృత్యంతో.. కేఎల్ఎన్ స్వామి బృందం భగవద్గీత పఠనంతో

.. శివ బృందం హనుమాన్ చాలీసా పారాయణంతో సభీకులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో హిందూ సమ్మేళనం కార్యాచరణ కమిటీ గౌరవాధ్యక్షులు గోపీనాథన్ పిల్లై, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కాట నరసింహ గౌడ్, బెజగం కేశవులు, సలహాదారులు పూజల ప్రభాకర్, చింతకింది గోవర్ధన్ గౌడ్, రమణీయమ్మ, రాజేశ్వరమ్మ, ప్రతినిధులు రవీందర్ రెడ్డి, రంగా గౌడ్

, పుట్ట వినయ్ కుమార్ గౌడ్, నాగేశ్వరరావు, లచ్చ మొళ్ల పాండు గౌడ్, గోపాల్ యాదవ్, పవన్ గౌడ్, ప్రభాకర్, జగదీష్, అశోక్, సత్యనారాయణ, నరసింహ, రాజు, నిర్మల్ కుమార్, సుధాకర్, జయశంకర్, పంచాక్షరి, మధుకర్, సుమన్, అంబ చారి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

హిందూ సమ్మేళనానికి హాజరైన ప్రముఖులు

సమ్మేళనానికి తరలివచ్చిన పరిసర ప్రాంతాల ప్రజలు

ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శన

ప్రధాని నరేంద్ర మోదీ సభకు తరలివెళ్లిన గచ్చిబౌలి డివిజన్ బీజేపీ శ్రేణులు

ప్రధాని బహిరంగ సభకు భారీగా తరలి వెళ్తున్న గచ్చిబౌలి శ్రేణులు

గోపనపల్లిలో ర్యాలీని ప్రారంభిస్తున్న తాజా మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి

తెలంగాణ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్న కేంద్ర ప్రభుత్వం : గంగాధర్ రెడ్డి

ఈకబురు, శేరిలింగంపల్లి : భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో నిర్వహించిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బహిరంగ సభకు గచ్చిబౌలి డివిజన్ బిజెపి శ్రేణులు భారీ ఎత్తున తరలి వెళ్లారు. గచ్చిబౌలి డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ వి గంగాధర్ రెడ్డి ఆధ్వర్యంలో డివిజన్ వ్యాప్తంగా ఆదివారం ఉదయం ర్యాలీ నిర్వహించారు. అనంతరం గోపనపల్లిలోని బిజెపి కార్యాలయం నుంచి గంగాధర్ రెడ్డి ఆధ్వర్యంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా పరేడ్ గ్రౌండ్ బహిరంగ సభకు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, రహదారులు, రైల్వేలు, ఐటీ, మౌలిక వసతులు, యువత ఉపాధి అవకాశాల కల్పనలో మోదీ ప్రభుత్వం కీలకంగా పనిచేస్తోందని పేర్కొన్నారు. తెలంగాణలో బీజేపీకి రోజు రోజుకూ ప్రజాదరణ పెరుగుతోందని, రాబోయే రోజుల్లో పార్టీ మరింత బలపడుతుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశాభివృద్ధి, తెలంగాణ ప్రగతే లక్ష్యంగా భారీ ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. "సబ్కా సాథ్ - సబ్కా వికాస్" నినాదాలతో బిజెపి సారథ్యంలోని ప్రభుత్వం ముందుకు సాగుతుందని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశంలో ఏ ఎన్నిక జరిగినా బిజెపి అఖండ విజయం సాధిస్తుందని.. దేశవ్యాప్తంగా కాషాయ జెండా రెపరెపలాడుతుందన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం లో బిజెపి రోజురోజుకు అత్యంత పటిష్టంగా మారుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకుల, కార్యకర్తలు అనుబంధ సంఘాల సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల సంఘాలతో టీఆర్ఎస్ చీఫ్ కవిత సమావేశం

అప్పటికీ హామీలు అమలు చేయకుంటే ఉద్యమకారులతో కలిసి ఆందోళన
ఉద్యమకారులతో సహపంక్తి భోజనం చేసిన టీఆర్ఎస్ చీఫ్

ఈకబురు,హైదరాబాద్ :
తెలంగాణ ఉద్యమకారుల డిమాండ్లకు టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత మద్దతు ప్రకటించారు. ఉద్యమకారుల సంఘాల సమావేశానికి హాజరై సంపూర్ణ మద్దతు ప్రకటించారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలుకు జూన్ 2 వరకు గడువు ఇస్తున్నామని అప్పటికీ హామీలు అమలు చేయకుంటే ఉద్యమకారులతో కలిసి ప్రక్యక్ష ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. జార్ఖండ్ ప్రభుత్వం ఉద్యమకారులకు అందిస్తున్న సంక్షేమ పథకాల తరహాలో తెలంగాణలో ఉద్యమకారులకు సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేశారు. హామీల అమలు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు భువనగిరి జిల్లా కేంద్రంలో సభ నిర్వహించాలని, భూపోరాటాలు ఉధృతం చేయాలని, జిల్లాల వారీగా ఉద్యమకారులతో సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. సమావేశంలో టీఆర్ఎస్ నాయకులు రూప్ సింగ్, సయ్యద్ ఇస్మాయిల్, మలి దశ తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సామ అంజిరెడ్డి, ఉపాధ్యక్షుడు మూల ప్రభాకర్ గౌడ్, కార్యదర్శులు వెలమల రాజేష్, శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ అధ్యక్షులు బోగి పద్మ, నాయకులు గుస్సా రవీందర్, అరుణ, తెలంగాణ ఉద్యమకారుల సంఘం అధ్యక్షుడు పూస శ్రీనివాస్, కొడిమల కృష్ణ, డీఎస్ మాణిక్యమ్మ, తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర జేఏసీ అధ్యక్షుడు రామగిరి ప్రకాశ్, ఉపాధ్యక్షులు బీరకాయల మధుసూదన్, భరత్ రెడ్డి, తొలి దశ ఉద్యమకారుల సంఘం ఉపాధ్యక్షులు సాజిద సికిందర్, శ్రీవల్లి, తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర కో ఆర్డినేటర్ కె. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఉద్యమకారులతో కలిసి కల్వకుంట్ల కవిత సహపంక్తి భోజనం చేశారు

12న భారాస ముఖ్యనేతలతో కేసీఆర్ సమావేశం

ఈకబురు, హైదరాబాద్: హైదరాబాద్: భారాస అధినేత కేసీఆర్ అధ్యక్షతన ఎర్రవెల్లిలోని ఆయన నివాసంలో ఈ నెల 12న పార్టీ ముఖ్య నేతలతో కీలక సమావేశం నిర్వహించనున్నారు. ఇటీవల భారాస ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా పార్టీ బలోపేతానికి సంస్థాగత నిర్మాణం, సభ్యత్వాల నమోదు, జిల్లాలు, శాసనసభ, పార్లమెంటరీ నియోజకవర్గాల ఇన్‌ఛార్జుల నియామకం, ఇతర పదవుల భర్తీ, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ఆందోళన కార్యక్రమాలు, సభలు, సమావేశాల నిర్వహణ సహా భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సహా కీలక నేతలు ఇందులో పాల్గొనాలని ఆహ్వానించారు.

ఇంటర్ అడ్మిషన్లు పాత పద్ధతిలోనే..

ఈకబురు, హైదరాబాద్: ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలు 2026-27 విద్యా సంవత్సరానికి పాత పద్ధతిలోనే చేపట్టాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ప్రవేశాలకు సమయం తక్కువగా ఉందని, ఇంటర్మీడియట్‌ను పాఠశాల విద్యలో విలీనం చేసే ప్రక్రియకు పలు సాంకేతిక సమస్యలు అడ్డుగా ఉండటంతో విద్యార్థుల ప్రయోజనాలకు భంగం వాటిల్లకుండా వెంటనే ప్రవేశాల ప్రక్రియను చేపట్టాలని స్పష్టం చేశారు. ఇంటర్మీడియట్‌ను రద్దు చేసి సీబీఎస్ఈలో తరహాలో 11, 12 తరగతులను పాఠశాల విద్యలోనే కొనసాగించాలని, ఫలితంగా డ్రాపౌట్స్ సంఖ్య గణనీయంగా తగ్గుతుందని తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించిన సంగతి తెలిసిందే. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి వరకు చదివిన విద్యార్థుల్లో అత్యధికులు ఆ తర్వాత ఇంటర్మీడియట్‌కు వేరుగా ఉన్న కళాశాలల్లో చేరడం లేదు. అక్కడితోనే చదుకు ఆపేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇంటర్మీడియట్‌ను వేరుగా కాకుండా 11, 12 తరగతులుగా కొనసాగించాలని ముఖ్యమంత్రి గతంలో అధికారులకు సూచించారు. ఇదే అంశాన్ని తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ కూడా తన నివేదికలో పేర్కొంది.

ఇటీవల ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలు నిలిపివేస్తూ అధికారులు ప్రకటన విడుదల చేయడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి ఆందోళన వ్యక్తమైంది. జూనియర్ కాలేజీల యాజమాన్యాలు కూడా ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ క్రమంలో సీఎం, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, సీఎం ముఖ్య కార్యదర్శి వి.వి.శేషాద్రి, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్, విద్యాశాఖ కమిషనర్ యోగితా రాణాలతో ఆదివారం సమీక్షించారు.

ఇంటర్మీడియట్ విద్యను పాఠశాల విద్యలో విలీనం చేయడంతో ముడిపడిన పలు సాంకేతిక సమస్యలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాల్సి ఉన్నందున ఈ ప్రక్రియను తాత్కాలికంగా వాయిదా వేయాలని నిర్ణయించారు. విలీన ప్రక్రియకు సంబంధించి భాగస్వాములతో విస్తృతంగా సంప్రదింపులు నిర్వహించాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఈ అంశంపై తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీపై నియమించిన కమిటీ అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని సూచించారు. అనంతరం శాసనసభలో చర్చించి తుది నిర్ణయం తీసుకుందామని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. సీఎం తాజా ఆదేశాలతో అతి త్వరలో ప్రవేశాలకు సంబంధించిన షెడ్యూల్‌ను ఇంటర్మీడియట్ బోర్డు విడుదల చేసే అవకాశం ఉంది.

వైభవంగా రైతు వారోత్సవాలు

ఈకబురు, తెలంగాణ బ్యూరో :
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యక్రమంలో భాగంగా, మే 4 నుండి 9 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన "రైతు వారం" కార్యక్రమాలు విజయవంతంగా ముగిశాయి. వ్యవసాయ శాఖతో పాటు అనుబంధ శాఖల అయినా ఉద్యానవన పట్టు పరిశ్రమ , విద్యుత్, మార్కెటింగ్, సహకార, పశుసంవర్ధక ,మత్స్య శాఖ, పౌర సరఫరా నీటిపారుదల సమస్వయంతో రైతులకు ఆధునిక సాగు పద్ధతులు, శాస్త్రీయ వ్యవసాయం, మార్కెటింగ్, యాంత్రీకరణ, పశుసంవర్ధక మరియు నీటిపారుదల అంశాలపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించారు.

నేల ఆరోగ్యం – శాస్త్రీయ సాగుకు తొలి అడుగు

మే 4న వికారాబాద్ జిల్లా తాండూరులో గౌరవ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతు వారం కార్యక్రమాలను ప్రారంభించారు, సేంద్రియ రైతులు పండించిన పంటల ఉత్పత్తులను క్రయవిక్రయాల కోసం తెలంగాణ రాష్ట్ర విత్తన మరియు సేంద్రీయ ధ్రువీకరణ అథారిటీ డెవలప్ చేసిన టీజీ ఆర్గానిక్స్ మొబైల్ యాప్ మంత్రి చేతుల మీదుగా ప్రారంభించబడింది. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన రైతు వారోత్సవాల్లో 222762 రైతులు,5850 అధికారులు,8157 ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. 14,565 మట్టి నమూనాలను సేకరించి, 20,734 మట్టి విశ్లేషణ పత్రాలను రైతులకు అందజేశారు. నానో ఎరువుల వినియోగం, ప్రకృతి వ్యవసాయం, సన్న వరి సాగు వంటి అంశాలపై రైతులకు శాస్త్రీయ అవగాహన కల్పించారు వినియోగదారులు కోరుకునే మరియు మార్కెట్లో అధిక డిమాండ్ కలిగిన సన్న వరి రకాలు బీపీటీ 5204 , ఆర్ ఎన్ ఆర్ 15048, హెచ్ఎంటి, జైశ్రీరామ్, కే ఎన్ ఎం.1638, డబ్ల్యూ జి ఎల్ 44, డబ్ల్యూ జి ఎల్ 962, జేజిఎల్ 1798 వంటి రకాలను సాగు చేయాలని శాస్త్రవేత్తలు సూచించారు.

ఆధునిక సాంకేతికతతో ఉద్యానవన రంగానికి ఊతం

మే 5న హనుమకొండలో గౌరవ మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,కొండ సురేఖ ఆధ్వర్యంలో మెగా రైతు మేళా నిర్వహించారు. ప్రత్యామ్నాయ పంటల సాగు, ముఖ్యంగా ఆయిల్ పామ్, నూనె గింజలు, పప్పు ధాన్యాల సాగుపై రైతులకు శిక్షణ ఇచ్చారు. బిందు సేద్యం, నీటి పొదుపు సాంకేతికతల వినియోగంపై ప్రత్యేక అవగాహన కల్పించారు.

మార్కెటింగ్ సదుపాయాలపై దృష్టి

మే 6న రైతులకు పంట రుణాలు, కిసాన్ క్రెడిట్ కార్డులు, సహకార సంఘాల సేవలపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. గోదాముల నిల్వ సదుపాయాలు, కనీస మద్దతు ధర (MSP), మార్కెటింగ్ అవకాశాలపై మార్కెటింగ్ శాఖ అధికారులు రైతులకు వివరించారు.

యాంత్రీకరణ – సౌర విద్యుత్ వినియోగంపై అవగాహన

మే 7న ఆధునిక వ్యవసాయ యంత్రాలు, డ్రోన్ సాంకేతికత ప్రదర్శనలు నిర్వహించారు. రైతులు పాల్గొన్న ఈ కార్యక్రమాల్లో 1,344 వ్యవసాయ యంత్రాలను ప్రదర్శించారు. 370 మంది రైతుల నుండి యంత్రాల కోసం దరఖాస్తులు స్వీకరించారు. అలాగే పీఎం కుసుమ్ పథకం కింద సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు, సబ్సిడీలపై అవగాహన కల్పించారు. రైతు వారం కార్యక్రమాల ద్వారా రైతుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించి, వ్యవసాయ ఖర్చులు తగ్గించి, దిగుబడులు మరియు ఆదాయాలు పెంచడం ద్వారా ఎంపీ కావ్య శాసనసభ్యులు శ్రీహరి వ్యవసాయ శాఖ కార్యదర్శి కె. సురేంద్ర మోహన్ డా.బి. గోపి ఐ.ఏ.ఎస్ వ్యవసాయ సంచాలకులు వ్యవసాయ శాఖ .ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పశుసంవర్ధక, మత్స్య మరియు నీటిపారుదల రంగాలకు ప్రాధాన్యం

రైతు వారం ఐదవ రోజున పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.రాష్ట్రవ్యాప్తంగా 593 కృత్రిమ గర్భధారణ క్యాంపులు నిర్వహించి, 35,336 పశువులకు వైద్య పరీక్షలు చేపట్టారు.అదేవిధంగా 2,654 మంది రైతులకు పచ్చిగడ్డి విత్తనాలు పంపిణీ చేశారు.

మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేపల ఉత్పత్తి పెంపు, చెరువుల నిర్వహణపై రైతులకు అవగాహన కల్పించారు.వేసవిలో పశువుల సంరక్షణ, పచ్చిగడ్డి సాగు, సమగ్ర నీటి వినియోగం, నీటి లభ్యత ఆధారంగా పంటల ప్రణాళికపై వివరించారు.నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో కాలువల మరమ్మత్తులు, చెరువుల పూడికతీత పనులు వేగవంతం చేయడంపై అవగాహన కల్పించారు. చెరువుల గట్లపై పిచ్చిమొక్కలు, కంపచెట్లు, గుర్రపుడెక్క తొలగింపు మరియు కాలువల శుభ్రత కార్యక్రమాల ప్రాముఖ్యత వివరించారు.చెరువుల నల్లమట్టి వినియోగం వల్ల నేల సారవంతం పెరుగుతుందని రైతులకు తెలియజేశారు.మే 9న నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో సమతుల్య నీటి వినియోగం, చెరువుల శుభ్రతపై అవగాహన కార్యక్రమాలతో రైతు వారోత్సవాలు విజయవంతంగా ముగిశాయి. ఈ రైతు వారోత్సవ కార్యక్రమాలు రైతులకు శాస్త్రీయ అవగాహన ఆధునిక సాంకేతిక ఆర్థిక భరోసా అందిస్తూ వ్యవసాయ అభివృద్ధికి దోహదపడుతున్నాయి రైతు సంక్షేమం ద్వారా తెలంగాణ వ్యవసాయ రంగం మరింత బలపడుతుందని ప్రభుత్వం విశ్వసిస్తుంది

ఊగిసలాటలు తప్పవా?

పశ్చిమాసియా యుద్ధం విషయంలో ఎటువంటి సానుకూల పరిణామాలూ కనిపించకపోవడంతో, మన మార్కెట్లు ఈవారం నిర్దిష్ట పరిమితికి లోబడే కదలాడొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. శాంతి చర్చల ప్రగతి పరిణామాలపై ఆధారపడి, స్వల్పకాలంలో సూచీల కదలికలు ఉంటాయని విశ్లేషకులు చెబుతున్నారు. అయితే ఆకర్షణీయ విలువల కారణంగా స్మాల్, మిడ్‌క్యాప్ సూచీలు రాణించొచ్చని చెబుతున్నారు. చమురు బ్యారెల్ ధర ఈ ఏడాది సగటున 96 డాలర్లు, వచ్చే ఏడాది 80 డాలర్లపైన ఉండొచ్చన్న ఏడీబీ అంచనాలు నిజమైతే కంపెనీల లాభదాయకతపై ప్రభావం చూపొచ్చు. కార్పొరేట్ కంపెనీల త్రైమాసిక ఫలితాలూ ప్రభావం చూపుతాయి. నిఫ్టీ-50కి ఈ వారం 23,800 పాయింట్ల వద్ద మద్దతు 24,800 వద్ద నిరోధం కనిపించొచ్చని సాంకేతిక నిపుణులు అంచనా వేస్తున్నారు. విదేశీ మదుపర్ల ధోరణీ కీలకమే. వివిధ రంగాలపై విశ్లేషకులు ఏమంటున్నారంటే..

- బలమైన ఆర్థిక ఫలితాల నేపథ్యంలో లోహ షేర్లు రాణించొచ్చు. ఇవి పెరిగినపుడల్లా ట్రేడర్లు లాభాలు స్వీకరించే అవకాశమూ ఉంది. కోకింగ్ కోల్ ధరలు పెరగుతున్నందున, ఉక్కు కంపెనీల పనితీరుపై ప్రభావం పడొచ్చు.
- ఎంపిక చేసిన యంత్రపరికరాల కంపెనీల షేర్లలో చలనాలు ఉండొచ్చు. ముడి చమురు అధిక ధర వల్ల, మార్జిన్లు తగ్గే ప్రమాదం ఉన్నందున విక్రయాల ఒత్తిళ్లూ కనిపించొచ్చు. 2026-27 అంచనాల విషయంలో అప్రమత్తతను ప్రకటించడంతో ఎల్ అండ్ టీ షేరుకు పలు బ్రోకరేజీలు రేటింగ్ తగ్గించాయి.
- భారతీ ఎయిర్‌టెల్ త్రైమాసిక ఫలితాలకు (ఈనెల 13న) అనుగుణంగా టెలికాం షేర్లపై మార్కెట్ స్పందించొచ్చు. ఎయిర్‌టెల్ లాభం పెరిగే వీలున్నందున, టెలికాం షేర్లకు సానుకూలతలు కనిపిస్తున్నాయి.
- సిమెంటు షేర్లు రాణించొచ్చు. సమీప భవిష్యత్తులో ధరలు పెరగొచ్చన్న అంచనాలు ఇందుకు కారణం. అయితే బలహీన గిరాకీ నేపథ్యంలో అల్ట్రాటెక్ సిమెంట్, అంబుజా సిమెంట్, శ్రీ సిమెంట్, దాల్మియా భారత్, జేకే సిమెంట్ ఎటువంటి నిర్ణయం తీసుకుంటాయనేది చూడాలి.
- శుక్రవారం వెల్లడైన ఫలితాల అనంతరం ఎస్‌బీఐ షేర్లు డీలా పడడంతో, ఈ వారం అన్ని బ్యాంకుల షేర్లనూ గమనించాలి. బ్యాంక్ నిఫ్టీ 54,000-56,500 శ్రేణిలోనే కదలాడొచ్చు. ఈ శ్రేణి నుంచి బయటకొస్తేనే ఎటువైపు వెళ్లేదీ తెలుస్తుంది.
- నిఫ్టీ ఆటోలో బులిష్ ధోరణి కొనసాగొచ్చు. 26,788-26,160 స్థాయుల్లో మద్దతు, 27,580-27,850 స్థాయుల్లో నిరోధం కనిపిస్తోంది. ఈ వారంలో టీవీఎస్ మోటార్, టాటా మోటార్స్, టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్, అపోలో టైర్స్, ట్యూబ్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఫలితాలున్నాయి.
- వరుసగా 5 వారాల పాటు లాభాలందిస్తున్న నిఫ్టీ ఎఫ్ఎమ్‌సీజీ సూచీ, ఈ వారమూ సానుకూలంగా కదలాడొచ్చు. 50,500-49,800 వద్ద మద్దతు, 51,920-52,570 వద్ద నిరోధం ఎదురుకావొచ్చు.
- ఔషధ కంపెనీల షేర్లు లాభాలందుకోవచ్చు. మార్చి త్రైమాసికంలో బలమైన లాభాల వృద్ధి నమోదవ్వొచ్చన్న అంచనాలు ఇందుకు దోహదం చేయొచ్చు. డాక్టర్ రెడ్డీస్, సిప్లా ఫలితాలు ఈ వారమే విడుదల కానున్నాయి.
- అమెరికా-ఇరాన్ శాంతి చర్చల ఫలితాల కోసం మదుపర్లు ఎదురుచూస్తున్నందున, చమురు షేర్లు ఒక శ్రేణికి లోబడి కదలాడొచ్చు. ఈ రంగ సూచీకి 11,300 వద్ద మద్దతు, 11,850-11,900 వద్ద నిరోధం కనిపిస్తోంది.
- రెండు వారాల రికవరీ అనంతరం ఐటీ షేర్లు ఒత్తిడికి గురికావచ్చు. ఫలితాలు ప్రకటించిన దిగ్గజ ఐటీ కంపెనీల యాజమాన్యాలు, భవిష్యత్తు అంచనాలపై ఆచితూచి స్పందించాయి. అంతర్జాతీయ గిరాకీ, వ్యయాలపై స్పష్టత వస్తేనే ఈ షేర్లలో అర్థవంత రికవరీ సాధ్యం.

స్థిరాస్తి రంగంలో సాంకేతిక విప్లవం

వ్యయ ఒత్తిళ్లు, కఠిన నిబంధనలే కారణం
ఫిక్కీ-కేపీఎంజీ నివేదిక

డిజిటల్, డేటా ఆధారిత సాంకేతికతలను మన దేశ స్థిరాస్తి రంగం వేగంగా అందిపుచ్చుకుంటోందని ఫిక్కీకేపీఎంజీ నివేదిక తెలిపింది. పెరుగుతున్న ఖర్చులు, కఠినమైన నియంత్రణ సంస్థల నిబంధనలే ఇందుకు కారణమని వెల్లడించింది. 'రీఇమాజినింగ్ ఇండియాస్ రియల్ ఎస్టేట్ ల్యాండ్‌స్కేప్ ది రోల్ ఆఫ్ టెక్నాలజీ ఇన్ వాల్యూ చెయిన్ ట్రాన్స్‌ఫర్మేషన్' పేరిట ఈ సంయుక్త నివేదికను సంస్థలు వెలువరించాయి. 2025 నాటికి దేశ స్థిరాస్తి మార్కెట్ విలువ 650 బిలియన్ డాలర్లు (సుమారు రూ.61.10 లక్షల కోట్లు)గా ఉండగా, 2047కి 5.8 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.545 లక్షల కోట్లు)కు చేరుతుందని అంచనా. రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్‌లు (రీట్స్), ఇన్విట్‌ల ద్వారా ఇప్పటికే 16 బి.డాలర్ల (సుమారు రూ.1.50 లక్షల కోట్ల)కు పైగా నిధులు ఈ రంగంలోకి వచ్చాయి. సాంకేతికత అవసరాలకు ప్రధాన కారణాలు: నిర్మాణ సామగ్రి, ఇతర ఖర్చులు పెరుగుతున్న తరుణంలో, నిర్వహణ సామర్థ్యాలు పెంచుకోవాలని కంపెనీలు భావిస్తున్నాయి. కఠినమైన నియంత్రణ నిబంధనలు, నిర్మాణంలో నిర్దేశిత గడువులను పాటించడం కంపెనీలకు కష్టతరంగా మారుతోంది. అంతర్జాతీయ, సంస్థాగత పెట్టుబడుదారులు కంపెనీల నుంచి పారదర్శకతను ఆశించడం కూడా కారణమే. ప్రస్తుత తరం గృహ కొనుగోలుదార్లు, డిజిటల్ పద్ధతుల్లో సమాచారాన్ని పొందుతూ, మెరుగైన వివరాలను కోరుకుంటున్నారు. స్థలం ఎంపిక, డిజైన్, నిర్మాణ పద్ధతులు, అమ్మకాలు, ఆస్తుల నిర్వహణ వంటి ప్రతి దశలోనూ టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తోంది. కాగితం ఆధారిత పాత పద్ధతుల నుంచి కంపెనీలు ప్రస్తుతం ప్రాప్‌టెక్ వైపు మళ్లుతున్నాయి.

భారతీయులు ఆస్తుల కొనుగోలును కేవలం ఒక లావాదేవీగా కాకుండా, అన్వేషణ నుంచి డాక్యుమెంటేషన్, ఫైనాన్సింగ్ వరకు సరళమైన డిజిటల్ ప్రయాణంగా మారాలని అభిలషిస్తున్నారని స్క్వేర్ యార్డ్స్ సహవ్యవస్థాపకుడు హితేశ్ సింగ్లా అభిప్రాయపడ్డారు. సాంకేతికత వల్ల అసంఘటితంగా ఉన్న స్థిరాస్తి రంగంలో పారదర్శకత, వేగం, జవాబుదారీతనం పెరుగుతున్నాయని వివరించారు.

ఇంటి బడ్జెట్ మరింత భారం

నిత్యావసరాల ధరలు పెంచే యోచనలో ఎఫ్ఎంసీజీ కంపెనీలు
ముడి సరకు వ్యయాలు, ప్యాకేజింగ్ ఖర్చుల ప్రభావం

ఇంటి ఖర్చులు మరింత పెరిగే అవకాశాలున్నాయి. ముడి చమురు అధిక ధరల కారణంగా ప్యాకేజింగ్ వ్యయాలు పెరగడం, లాభాలు తగ్గుతున్న నేపథ్యంలో.. నిత్యావసరాల ధరలను మరోసారి పెంచేందుకు ఎఫ్ఎంసీజీ కంపెనీలు సన్నాహాలు చేస్తుండటం ఇందుకు కారణం. సబ్బులు, డిటర్జెంట్లు, బిస్కెట్లు, ప్యాకేజ్డ్ ఫుడ్స్, పానీయాల ధరలు పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే తమ ఉత్పత్తుల ధరలను 35% మేర ఎఫ్ఎంసీజీ కంపెనీలు పెంచిన సంగతి విదితమే. మళ్లీ ధరలు పెంచడానికి సిద్ధంగా ఉన్నామని, ఆయా కంపెనీల ఎగ్జిక్యూటివ్‌లు మదుపర్లతో నిర్వహించిన ఎర్నింగ్ కాల్స్‌లో వెల్లడించారు. ముడి చమురు ధరల వల్ల ద్రవ్యోల్బణ ఒత్తిడి అధికమైందని, రవాణా వ్యయాలు పెరిగాయని, డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ క్షీణతకు తోడు, భౌగోళికరాజకీయ ఉద్రిక్తతల మధ్య ప్రపంచ సరఫరా వ్యవస్థల్లో అంతరాయాల వల్ల ఉత్పత్తుల ధరలు పెంచాల్సి వస్తోందని వారు వివరించారు. అయితే అమ్మకాలు పడిపోకుండా చూసేందుకు. రూ.5, 10, 15 ఖరీదు చేసే చిన్న ప్యాకెట్ల ఉత్పత్తి పెంచాలని యోచిస్తున్నాయి. దీంతోపాటు వ్యయ నియంత్రణ కోసం రాయితీలు, ప్రోత్సాహకాలను తగ్గిస్తున్నాయి.

దిగ్గజ కంపెనీలు ఇలా.....

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తమ కంపెనీ ఇప్పటికే 10% ద్రవ్యోల్బణాన్ని ఎదుర్కొంటోందని, ఈ ప్రభావాన్ని తగ్గించుకునేందుకు ఇప్పటికే ధరలను 4% పెంచినట్లు డాబర్ ఇండియా గ్లోబల్ సీఈఓ మోహిత్ మల్హోత్రా తెలిపారు. ఈ సంవత్సరం వృద్ధి రెండంకెల్లో ఉంటుందని ఆశిస్తున్నట్లు వెల్లడించారు. ధరల పెంపు ద్వారా వచ్చే విలువ వృద్ధితో పాటు పరిమాణ వృద్ధి కూడా కలిసి ఉంటుందని వివరించారు. ఇంధనం, ప్యాకేజింగ్ ఖర్చులు సుమారు 20% పెరగడంతో.. ఉత్పత్తుల ధరలు పెంచుతున్నట్లు బేకరీ ఉత్పత్తులు, బిస్కెట్ల తయారీ సంస్థ బ్రిటానియా తెలిపింది. గుడ్‌డే, మేరీగోల్డ్, మిల్క్ బికీస్, టైగర్ వంటి బ్రాండ్‌లు ఈ కంపెనీవే. కొన్ని ఉత్పత్తుల ధరలను పెంచడం, కొన్ని ప్యాక్‌లలో పరిమాణం తగ్గించడం వంటి విధానాలు అనుసరిస్తామని సంస్థ ఎండీ, సీఈఓ రక్షిత్ హర్గావే తెలిపారు. సర్ఫ్ ఎక్సెల్, బ్రూక్ బాండ్, లైఫ్‌బాయ్, డోవ్, క్లినిక్ ప్లస్, సన్‌సిల్క్, లాక్మే వంటి ప్రముఖ బ్రాండ్లను కలిగి ఉన్న హెచ్‌యూఎల్ కూడా.. ముడి సరకుల ధరలపై ఒత్తిళ్లు కొనసాగితే ఉత్పత్తుల ధరలు పెంచుతామనే సంకేతాలు ఇచ్చింది. ముడి సరకు వ్యయాల రూపంలో ఇప్పటికే 810% భారం పడిందని, అందువల్లే కొన్ని ఉత్పత్తుల ధరలను 25% పెంచామని హెచ్‌యూఎల్ సీఎఫ్ఓ నిరంజన్ గుప్తా వెల్లడించారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే, ఉత్పత్తుల ధరలు మళ్లీ పెంచుతామని స్పష్టం చేశారు. ఫెవికాల్, డాక్టర్ ఫిక్సిట్, ఫెవిక్విక్, ఎంసీల్ వంటి ప్రముఖ బ్రాండ్ల సంస్థ పిడిలైట్ ఇండస్ట్రీస్ కూడా మరో విడత ధరల పెంపునకు సిద్ధమవుతోందని సంస్థ ఎండీ సుధాన్షు వాట్స్ తెలిపారు. ఈ కంపెనీ ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో ఇప్పటికే రెండుసార్లు ధరలు పెంచింది. ముడి సరకుల వ్యయాల్లో సగటున 4050% పెరుగుదలను భర్తీ చేయడానికి, ఇప్పుడు మళ్లీ ధరల పెంపును పరిశీలిస్తున్నట్లు చెబుతున్నారు. ప్యాకేజ్డ్ నీళ్లు, పానీయాలు విక్రయిస్తున్న వరుణ్ బెవరేజెస్ చైర్‌పర్సన్ రవి జైపురియా, మారికో ఎండీ సీఈఓ సౌగటా గుప్తా, టాటా కన్జ్యూమర్ ప్రోడక్ట్స్ లిమిటెడ్ ఎండీ, సీఈఓ సునీల్ డిసౌజా, నెస్లే ఇండియా ఛైర్మన్, ఎండీ మనీశ్ తివారీ తదితరులు కూడా తమ ఉత్పత్తుల ధరలు పెరిగే అవకాశం ఉందని వెల్లడించారు.

ప్రైవేటు మూలధన వ్యయాలు రూ.7.7 లక్షల కోట్లకు

ఇంధన వినియోగం తగ్గిస్తాం: సీఐఐ

దిల్లీ: దేశంలో ప్రైవేటు రంగ మూలధన వ్యయాలు 2025 సెప్టెంబరు నాటికి 67% పెరిగి రూ.7.7 లక్షల కోట్లకు చేరినట్లు భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) తెలిపింది. ఏడాది క్రితం ఈ మొత్తం రూ.4.6 లక్షల కోట్లు మాత్రమేనని వివరించింది. తమ సభ్య కంపెనీలు రాబోయే 2 త్రైమాసికాల్లో ఇంధన, విద్యుత్తు వినియోగాన్ని 35% తగ్గించేందుకు కట్టుబడి ఉన్నాయని, పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని పెంచుతాయని స్పష్టం చేసింది. పశ్చిమాసియా సంక్షోభ పరిమాణాల్లో దేశీయంగా రిటెయిల్ ధరలు పెంచుకుండా చూసేందుకు.. పెట్రోల్, డీజిల్‌పై కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాల కోత విధించడాన్ని ప్రశంసిస్తూ, చమురు ధరల స్థిరీకరణ తరవాత దశల వారీగా 'రేట్ల కోత'ను ఉపసంహరించుకోవాలని సూచించింది. దీంతోపాటు ఆర్థిక వ్యవస్థ వృద్ధికి 5 అంశాల పారిశ్రామిక కార్యాచరణ ప్రణాళికలను సీఐఐ ఆవిష్కరించింది. దేశంలో పెట్టుబడులు పెరుగుతుండటం ఆశాజనకమని సీఐఐ పేర్కొంది. అందువల్ల ముడి చమురు ధరలు స్థిరపడిన తర్వాత 69 నెలల వ్యవధిలో, ఎక్సైజ్ సుంకాల కోతను విడతల్లో ఉపసంహరించాలని సీఐఐ సూచించింది. ఈలోపు కంపెనీలు కూడా ఇంధనాన్ని సమర్థంగా వినియోగించడం, విద్యుత్తు వాహనాల వాడకం ద్వారా సంప్రదాయ ఇంధన వినియోగాన్ని 35% తగ్గిస్తాయని వివరించింది. ఎంఎస్ఎంఈలకు 45 రోజుల్లో చెల్లింపు హామీ, దిగుమతి ప్రత్యామ్నాయంతో సరఫరా వ్యవస్థను పటిష్టం చేయడం, స్వచ్ఛందంగా ధరల నియంత్రణ, ఇంటర్‌న్‌షిప్ నియామకాల పెంపు, ప్రైవేటు మూలధన వ్యయాన్ని ముందుగానే కేటాయించడం వంటి వాటినీ ప్రస్తావించింది.

అగ్రస్థానంలో తయారీ రంగం....

సీఎంఐఈ ప్రోవెస్ డేటాబేస్ నుంచి సేకరించిన సుమారు 1,200 కంపెనీల వివరాలపై సీఐఐ చేసిన విశ్లేషణ ప్రకారం.. నికర స్థిర ఆస్తులు, నిర్మాణంలో ఉన్న మూలధన పనుల్లో వార్షిక మార్పుగా కొలిచే ప్రైవేటు రంగ పెట్టుబడి, ఏడాది వ్యవధిలో రూ.4.6 లక్షల కోట్ల నుంచి 67% పెరిగి 2025 సెప్టెంబరు నాటికి రూ.7.7 లక్షల కోట్లకు చేరింది. ఇందులో తయారీ రంగం అగ్రస్థానంలో నిలిచింది. మొత్తం ప్రైవేటు మూలధన వ్యయంలో తయారీ రంగమే సుమారు 50% లేదా రూ.3.8 లక్షల కోట్ల వాటాను కలిగి ఉంది. ఇందులో లోహాలు, వాహనాలు, రసాయన రంగాలు ముందు వరుసలో ఉన్నాయి. సేవల రంగ పెట్టుబడి రూ.3.1 లక్షల కోట్లు (సుమారు 40% వాటా)గా ఉంది. ట్రేడింగ్, కమ్యూనికేషన్స్, ఐటీ/ఐటీఈఎస్ రంగాలు దోహదపడ్డాయి. 202526 మూడో త్రైమాసికంలో తయారీ సంస్థల సామర్థ్య వినియోగం 75.6 శాతానికి పెరిగింది. అంతకుముందు త్రైమాసికంలో ఇది 74.3 శాతంగా ఉంది. కొత్త ఆర్డర్ల సంఖ్య వార్షికంగా 10.3% పెరిగింది. 202526 తొలి అర్ధ భాగంలో 10 శాతంగా ఉన్న బ్యాంక్ రుణ వృద్ధి, రెండో అర్ధ భాగంలో 14 శాతానికి చేరింది. ప్రపంచ అనిశ్చితుల్లో పరిశ్రమలు ముందుకొచ్చి, జాతీయ భారాన్ని పంచుకోవాలని సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ కోరారు.

ఈవీ, బ్యాటరీ టెక్నాలజీల్లో
రూ.8,500 కోట్ల పెట్టుబడులు

విద్యుత్ వాహనాలు (ఈవీ), బ్యాటరీ సాంకేతికత రంగాల్లో స్వయం సమృద్ధి సాధించేందుకు దిగ్గజ సంస్థలు టాటా, జేఎస్‌డబ్ల్యూ గ్రూప్‌లు వేర్వేరుగా సన్నాహాలు చేస్తున్నాయి. ఈ రెండు సంస్థలూ ఈ విభాగంలో పెడుతున్న పెట్టుబడుల మొత్తం 900 మిలియన్ డాలర్లు (సుమారు రూ.8,500 కోట్లు) ఉంటుందని సమాచారం. ఈ రంగాల్లో ఆధిపత్యం వహిస్తున్న చైనా సాంకేతికతపై ఆధారపడటాన్ని తగ్గించడమే లక్ష్యంగా మన దిగ్గజ సంస్థలు ముందడుగు వేస్తున్నాయి.

టాటా గ్రూప్‌నకు చెందిన బ్యాటరీ విభాగం అగ్రతాస్, బెంగళూరులో కొత్త పరిశోధన, అభివృద్ధి కేంద్రం కోసం 400 మి.డాలర్ల (రూ.3,800 కోట్ల)కు పైగా పెట్టుబడి పెట్టనుంది. ప్రస్తుతం చైనా నుంచి దిగుమతి చేసుకుంటున్న లిథియం ఐరన్ ఫాస్ఫేట్, లిథియం మాంగనీస్ ఐరన్ ఫాస్ఫేట్ సాంకేతికతలను దేశీయంగా అభివృద్ధి చేయడంపై దృష్టి పెట్టనుంది.

జేఎస్‌డబ్ల్యూ గ్రూప్, మహారాష్ట్రలో రీసెర్చ్ హబ్ ఏర్పాటు చేయడానికి వచ్చే 56 ఏళ్లలో కనీసం 500 మి.డాలర్ల (రూ.4,700 కోట్ల) పెట్టుబడులు పెట్టాలని భావిస్తోంది.

కీలక లక్ష్యాలివే: విద్యుత్ వాహనాల్లో ఖరీదైన, క్లిష్టమైన భాగం బ్యాటరీ. చైనా తన సాంకేతికతను పంచుకోవడంలో ఆంక్షలు విధిస్తున్న నేపథ్యంలో, భారత కంపెనీలు తమ సొంత మేధో సంపత్తిని సృష్టించుకోవాలని భావిస్తున్నాయి. అంతర్జాతీయ ఆటోమోటివ్ టెక్నాలజీని మన దేశ రహదారులు, వాతావరణం, ధరలకు అనుగుణంగా మార్చడమే జేఎస్‌డబ్ల్యూ రీసెర్చ్ కేంద్రం ప్రధాన లక్ష్యం.

అమ్మ తర్వాతే దైవమైనా..

ఫ్యామిలీ ఫొటోలు పంచుకున్న చిరంజీవి

కనిపించే దైవం కూడా కనిపెంచిన మాతృమూర్తి తర్వాతే అంటూ మాతృదినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు ప్రముఖ నటుడు చిరంజీవి. "అమ్మ.. మన మొదటి గురువు, ధైర్యం. మన విజయాల వెనుక త్యాగం, మన ప్రతి అడుగులోనూ నిశ్శబ్దంగా నిలిచే ఆశీర్వాదం అమ్మదే. మనకన్నా మనల్ని ఎక్కువ ప్రేమించే మాతృమూర్తులందరికీ శుభాకాంక్షలు" అని పేర్కొన్నారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టు పెడుతూ.. కుటుంబంతో కలిసి దిగిన నాటి ఫొటోలను పంచుకున్నారు.

'జన నాయగన్' విడుదల ఎప్పుడు?

... స్పందించిన నిర్మాత

కొంత సందిగ్ధత అనంతరం ప్రముఖ నటుడు, టీవీకే అధ్యక్షుడు విజయ్ తమిళనాడు ముఖ్యమంత్రిగా ఆదివారం ప్రమాణ స్వీకారం చేసిన సంగతి తెలిసిందే. ఇక, సినీ అభిమానుల దృష్టంతా ఆయన నటించిన 'జన నాయగన్' విడుదలపైనే ఉంది. చెన్నైలో జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన ఈ మూవీ నిర్మాత కేవీఎన్‌ను మీడియా ప్రశ్నించగా స్పందించారు.''అందరూ 'జన నాయగన్' సినిమా గురించి ఆలోచిస్తున్నారు. కానీ, విజయ్ ఇప్పుడు తమిళనాడు జన నాయగన్. చాలా సంతోషంగా ఉంది. 'జన నాయగన్' సెన్సార్ సర్టిఫికెట్ కోసం ఎదురుచూస్తున్నాం. అది రాగానే విడుదల చేస్తాం. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన విజయ్ సర్‌కు అభినందనలు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఆయన నెరవేరుస్తారని ఆశిస్తున్నా'' అని పేర్కొన్నారు. విజయ్ హీరోగా హెచ్. వినోద్ తెరకెక్కించిన ఈ పొలిటికల్ యాక్షన్ మూవీ సెన్సార్ నిబంధనల కారణంగా విడుదల కాలేదన్న సంగతి తెలిసిందే. ఈ విషయం న్యాయస్థానాల వరకూ వెళ్లింది. దీని కోసం ప్రత్యేకంగా రివైజింగ్ కమిటీ ఏర్పాటైంది. ఈ కమిటీ ఇచ్చే రిపోర్టును బట్టి మూవీ రిలీజ్ డేట్ ఆధారపడి ఉంది.

'సలామ్ ఎ ఇష్క్' సీక్వెల్ సన్నాహాలు

సల్మాన్ ఖాన్, ప్రియాంక చోప్రా

'సలామ్ఎఇష్క్'.. రెండు దశాబ్దాల క్రితం విడుదలైన ఈ సినిమా హిందీ ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకుంది. బాలీవుడ్ అగ్రహీరో సల్మాన్ ఖాన్, ప్రియాంక చోప్రా, అనిల్ కపూర్, విద్యాబాలన్ తదితరులు ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాని నిఖిల్ అడ్వాణీ తెరకెక్కించారు. ఇప్పుడీ హిట్ చిత్రానికి సీక్వెల్‌ను తీసుకురావడానికి చిత్రబృందం సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ''ఈ చిత్రాన్ని ఫ్రాంచైజీగా తీర్చిదిద్దాలని దర్శకుడు నిఖిల్ ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పుడు రాబోయే కొనసాగింపు చిత్రం విధి, అదృష్టం, ప్రేమ ద్వారా ముడిపడిన మూడు జంటల చుట్టూ తిరుగుతుంది. భారతదేశంలో ప్రేమ, బంధాలపై ఇదొక సరికొత్త దృక్పథాన్ని అందిస్తుంది. ప్రస్తుతం స్క్రిప్ట్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే వచ్చే ఏడాది ప్రారంభంలో ఇది పట్టాలెక్కే అవకాశముంద''ని బాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మరి ఈ రెండో భాగంలో కూడా సల్మాన్ భాగమవుతాడా? లేదా అనేది తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకూ వేచి చూడాల్సిందే.

అమ్మ అయితేనేం.. అదరగొడతాం

'అమ్మయ్యాక కెరీర్‌ను పక్కన పెట్టేశా..' ఎక్కువశాతం కథానాయికల నుంచి వచ్చే మాట ఇది. ఇలా మాతృత్వ దశలోకి అడుగుపెట్టగానే సినిమాలకు దూరంగా ఉన్న తారలు ఎంతో మంది. కానీ కొందరు మాత్రం భిన్నంగా అడుగులేస్తారు. ఇప్పుడు అలా తమ జీవితాల్లో అమ్మతనానికి ప్రత్యేక స్థానాన్ని ఇస్తూనే.. వృత్తిపరంగానూ తగ్గేదే లే అంటూ సత్తా చాటుతున్నారు మన అందాల తారలు. మాతృత్వాన్ని ఆస్వాదిస్తూనే.. రాబోయే చిత్రాల కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. సినీ కెరీర్‌కు ఏదీ అడ్డంకి కాదని నిరూపిస్తున్నారు. ఇప్పుడీ బాటలోనే అడుగులు వేస్తూ.. పలువురు అగ్ర నాయికలు తెరపై యాక్షన్‌తో అదరగొట్టడానికి సిద్ధమవుతున్నారు.

''అమ్మ కేవలం నటిస్తోంది.. ఇదంతా నిజం కాదు.. సరేనా?'' అంటూ ఇటీవలే సెట్లో చిత్రీకరణ విరామంలో తన కడుపులోని బిడ్డతో పెట్టిన ముచ్చట్లని అభిమానులతో పంచుకుంది అందాల తార కియారా అడ్వాణీ. ఆమె గర్భం దాల్చిన తర్వాత కూడా సవాలుతో కూడిన సన్నివేశాల చిత్రీకరణలో పాల్గొన్నట్లు ఓ ఇంటర్వ్యూలో పంచుకుంది. గతేడాది కియారా పాపకి జన్మనిచ్చిన విషయం తెలిసిందే. ప్రస్తుతం తల్లిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఈమె.. మరి కొన్ని రోజులు విరామం తీసుకొని మళ్లీ సెట్లోకి అడుగుపెట్టడానికి రంగం సిద్ధం చేసుకుంటోంది. ప్రస్తుతం కియారా.. యశ్ సరసన 'టాక్సిక్' చిత్రంలో కథానాయికగా నటిస్తోంది. ఇందులో ఆమె నదియాగా కనువిందు చేయనుంది. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహించిన ఈ యాక్షన్ థ్రిల్లర్ మార్చి 19న థియేటర్లలోకి రానుంది.

--కింగ్‌తో రీ ఎంట్రీ

తల్లిగా విరామం తీసుకున్నా.. కానీ కథానాయికగా కాదు అంటూ మళ్లీ సెట్లోకి అడుగుపెట్టింది బాలీవుడ్ కథానాయిక దీపికా పదుకొణె. ఆమె 2024 సెప్టెంబరులో ఓ పాపకు జన్మనిచ్చింది. తన బిడ్డ కోసం సమయం కేటాయించిన దీపిక.. 2025లో కూడా ఖాతా తెరవలేదు. కొన్ని రోజులుగా మాతృత్వ దశను ఆస్వాదిస్తూ విరామం తీసుకుని.. ఇటీవలే రెండోసారి గర్భం దాల్చినట్లు ప్రకటించింది. దీంతో ఆమె తన రాబోయే సినిమాల్లో ఎలాంటి యాక్షన్స్ సీక్వెన్స్ చేయదని ఊహించారు అభిమానులు. కానీ వారందరికీ.. గర్భవతిగానే 'కింగ్' సెట్లోకి అడుగుపెట్టి షాక్ ఇచ్చింది దీపిక. దీంతో కింగ్‌తో ఆమె మళ్లీ రీ ఎంట్రీ ఇచ్చిందని నెట్టింట్లో ప్రేక్షకులు కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. బాలీవుడ్ అగ్రహీరో షారుక్ ఖాన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రమే 'కింగ్'. మరోవైపు 'ట్రిపుల్ ఎక్స్: రిటర్న్ ఆఫ్ జాండర్ కేజ్' అనే హాలీవుడ్ సినిమా సీక్వెల్‌లోనే ఈమే కథానాయికగా నటిస్తోంది. తన కుమార్తె కోసం ఈ సినిమా చిత్రీకరణను ముంబయిలోనే పూర్తి చేయాలని దీపిక నిర్ణయించుకుందట.

--తల్లైన తగ్గని జోరు

''తన తల్లి.... పని, సినిమాల పట్ల ఎంతో అభిరుచి ఉన్న వ్యక్తి అని మా పాప తెలుసుకోవాలని కోరుకుంటున్నా'' అంటూ ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో చెప్పింది అలియా భట్. తల్లిగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే.. వృత్తిపరంగా రాణిస్తున్న కథానాయికల్లో ఈమె కూడా ఒకరు. వైవిధ్యమైన కథలతో ప్రేక్షకుల్ని అలరించే ఆమె... 2022లో తన కుమార్తె రాహాకు స్వాగతం పలికింది. ప్రస్తుతం ఓవైపు రాహా బాగోగులు చూసుకుంటూనే.. వరుస సినిమా చిత్రీకరణలతో తీరిక లేకుండా గడుపుతోంది అలియా. అప్పుడప్పుడూ తన కుమార్తెను సెట్లోకి తీసుకొస్తుంటానని కూడా పలు సందర్భాల్లో పంచుకుంది అలియా. ఇప్పుడామె ఖాతాలో 'లవ్ అండ్ వార్', 'ఆల్ఫా' లాంటి సినిమాలు ఉన్నాయి. భాషతో సంబంధం లేకుండా అవకాశాల్ని అందుకుంటోన్న ప్రియాంక చోప్రా కూడా ఈ కోవకు చెందిన కథానాయికే. నిక్ జోనాస్‌తో పెళ్లయ్యాకా హాలీవుడ్‌లో మరింత వేగంగా సినిమాలు, సిరీస్‌లు చేస్తోంది. ఈ ఇద్దరికీ కూతురంటే ఎంతో ప్రేమ. తల్లిగా కూతుర్ని ప్రేమగా పెంచుతూనే యాక్షన్ కథల్లో సత్తా చాటుతోంది ప్రియాంక. ప్రస్తుతం ఆమె.. అగ్రహీరో మహేశ్ బాబు సరసన 'వారణాసి' లో నటిస్తోంది.

ఒకటికి.. మరొకటి

కథానాయకులు నితిన్, సిద్ధు జొన్నలగడ్డ వరుస సినిమాలతో జోరు చూపించనున్నారు. ఇప్పటికే ఓ కొత్త కబురు వినిపించగా.. అది యాక్షన్ చెప్పుకునేలా లోపే మరో కొత్త కలయికను ఖరారు చేసుకున్నారన్న సంకేతాలు అందుతున్నాయి. కొంత విరామం తర్వాత నితిన్ ఇటీవలే సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థలో ఓ కొత్త చిత్రానికి శ్రీకారం చుట్టారు. దీన్ని నారి సిరిసవాడ, టి సోమశేఖర్ అనే ఇద్దరు కొత్త దర్శకులు రూపొందిస్తున్న సంగతి తెలిసిందే. ఇది వచ్చే వారం రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభించుకోనుండగా.. ఈలోగానే నితిన్‌కి సంబంధించి మరో ఆసక్తికర వార్త బయటకొచ్చింది. 'జాతిరత్నాలు' ఫేమ్ అనుదీప్‌తో ఓ సినిమా చేసేందుకు పచ్చజెండా ఊపారని సమాచారం. ఇప్పటికే దీనికి సంబంధించిన కథాలోచనని నితిన్‌తో పంచుకున్నారని.. అది నచ్చడంతో పూర్తి స్క్రిప్ట్ సిద్ధం చేయమన్నారని తెలిసింది. దీన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థ నిర్మించే అవకాశముంది. ఇక మరోవైపు 'ఆయ్' దర్శకుడు అంజితోనూ నితిన్ ఓ సినిమా చేయనున్నారన్నప్రచారం వినిపిస్తోంది.

--శ్రీకారం చుట్టేశారా!

గతేడాది 'తెలుసు కదా' చిత్రంతో ప్రేక్షకుల్ని పలకరించారు హీరో సిద్ధు జొన్నలగడ్డ. ఆ వెంటనే 'ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ' ఫేమ్ స్వరూప్ ఆర్ఎస్‌జేతో ఓ సినిమా చేయనున్నట్లు ప్రకటించారు. ఇది త్వరలో చిత్రీకరణ ప్రారంభించుకోవాల్సి ఉంది. అయితే ఈలోగానే ఆయన ఓ వెబ్‌సిరీస్ కోసం దర్శకుడు వెంకీ అట్లూరితో చేతులు కలిపినట్లు తెలిసింది. అంతేకాదు ఇది ఇటీవలే పూజా కార్యక్రమాలతో లాంఛనంగా మొదలైనట్లు సమాచారం. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్ కోసం రూపొందిస్తున్న ఈ సిరీస్‌ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక మరోవైపు సిద్ధు ఓ కొత్త దర్శకుడు చెప్పిన సోషియో ఫాంటసీ కథకు పచ్చజెండా ఊపినట్లు టాక్ వినిపిస్తోంది.

కాలాల్ని దాటి.. లోకాల్ని చుట్టేసి

తెరపై అగ్ర హీరోల సాహసయాత్ర

ఇప్పుడు తెలుగు చిత్రసీమలో కథలన్నీ టైమ్ మిషన్ ఎక్కేశాయి. ప్రేక్షకుల్ని చరిత్ర లోతుల్లోకి తీసుకెళ్లి.. మునుపెన్నడూ వినని, కనని సరికొత్త ప్రపంచాల్ని చూపించనున్నాయి. ప్రస్తుతం అగ్ర కథానాయకుల నుంచి కుర్ర హీరోల వరకు దాదాపు ప్రతిఒక్కరూ ఈ పీరియాడిక్ సినిమాలతోనే అలరించేందుకు సిద్ధమవుతున్నారు. అయితే వీళ్లలో కొందరు మరో అడుగు ముందేసి ఏకంగా కాలాల్ని దాటి.. లోకాల్నే చుట్టేసే పనిలో పడ్డారు. సినీప్రియుల్ని వీలుంటే యుగాల వెనక్కో... లేదంటే భవిష్యత్ ప్రపంచానికో తీసుకెళ్లి ఓ కొత్త సినిమాటిక్ అనుభూతిని పంచివ్వాలని ఉవ్విళ్లూరుతున్నారు.

ప్రేక్షకుల్ని టైమ్ మిషన్ ఎక్కించి.. సరికొత్త ఊహాప్రపంచాల్లో విహరింపజేసి.. వాళ్లతో ''అద్భుతః'' అనిపించడంలో దర్శకుడు రాజమౌళిని కొట్టేవాళ్లు లేరు. 'మగధీర', 'బాహుబలి' లాంటి విజయవంతమైన చిత్రాలతో దాన్నిప్పటికే నిరూపించారు. ఇప్పుడాయన 'వారణాసి' సినిమాతో సినీప్రియుల్ని ఏకంగా యుగాల వెనక్కి తీసుకెళ్లి.. సరికొత్త సినిమాటిక్ అనుభూతిని పంచిచ్చేందుకు సిద్ధమవుతున్నారు. మహేశ్‌బాబు కథానాయకుడిగా నటిస్తున్న ఈ బహుభాషా చిత్రం ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోంది. తొలుత ఇది ప్రపంచాన్ని చుట్టేసే సాహసికుడి కథతో రూపొందుతున్నట్లు ప్రచారం జరిగినా.. టైటిల్ గ్లింప్స్‌తో ఇది ప్రపంచాన్నే కాదు, యుగాల్నే చుట్టొచ్చే సాహసి కథని అర్థమైంది. దీనికి తగ్గట్లే యుగాల వెనక్కి వెళ్లి లంకా నగరాన్ని.. ఆనాటి అపురూప రామ రావణ యుద్ధ ఘట్టాన్ని, దీనితోపాటు నాటి ప్రాచీన వారణాసిని.. ఈ వర్తమాన కలియుగాన్ని వెండితెరపై ఆవిష్కరించనున్నారు జక్కన్న. మరి ఈ కథలో లోకాన్ని రక్షించేందుకు రుద్రగా మహేశ్ చేసిన సాహసాలేంటి.. త్రేతాయుగంలోని శ్రీరాముడికి ఆయనకు ఉన్న సంబంధం ఏంటి? కాలప్రయాణం చేసి యుగాల వెనక్కి ఎందుకు వెళ్లాల్సి వచ్చింది? అన్నది సినిమా చూసి తెలుసుకోవాలి. ఇది వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు చిత్ర బృందం ఇప్పటికే ప్రకటించింది.

సవాళ్లను దాటే విశ్వంభరుడు..

'బింబిసార' సినిమాతో సినీప్రియుల్ని చరిత్ర లోతుల్లోకి తీసుకెళ్లారు దర్శకుడు వశిష్ఠ. ఇప్పుడాయన 'విశ్వంభర'తో 14లోకాల్ని కళ్లకు కట్టినట్లు చూపించేందుకు సమాయత్తమవుతున్నారు. చిరంజీవి కథానాయకుడిగా నటించిన చిత్రమిది. ఇది ఇతిహాసాలతో ముడిపడిన సోషియో ఫాంటసీ థ్రిల్లర్‌గా ముస్తాబైన సంగతి తెలిసిందే. పురాణాల రీత్యా మనకు 14లోకాలున్న విషయం విధితమే. ఈ కథ ప్రధానంగా వాటితో ముడిపడి సాగనుంది. ప్రతి నాయకుడు ఎత్తుకెళ్లిన కథానాయికను తిరిగి తీసుకొచ్చేందుకు కథానాయకుడు ఆ 14లోకాల్ని దాటి ఎలా వెళ్లాడు.. ఆ ప్రయాణంలో ఎదురైన సవాళ్లేంటి అన్నది ఈ చిత్ర ఇతివృత్తమని ఇప్పటికే దర్శకుడు స్పష్టత ఇచ్చారు. అంతేకాదు ఈ సినిమా కోసం ఓ కొత్త ఫిక్షనల్ లోకాన్ని సృష్టించినట్లు వెల్లడించారు. దీంట్లోని ఆ లోకాలు, అందులోని సరికొత్త జీవులు.. అన్నీ ప్రేక్షకుల్ని ఆశ్చర్యపరచనున్నట్లు ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ సినిమా జులైలో థియేటర్లలోకి రానుందట.

మహాభారత కాలం.. కలి యుగాంతం!

మహాభారత కురుక్షేత్ర మహా సంగ్రామాన్ని.. కలి యుగాంతాన్ని ముడిపెట్టి దర్శకుడు నాగ్ అశ్విన్ రూపొందించిన మైథలాజికల్ సైన్స్ ఫిక్షన్ సినిమా 'కల్కి 2898ఏడీ'. ప్రభాస్, అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్ ప్రధాన పాత్రధారులుగా నటించిన ఈ సినిమా.. 2024లో విడుదలై, భారీ విజయాన్ని సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడీ చిత్ర సీక్వెల్‌తో సినీప్రియుల్ని మరోసారి కాలప్రయాణం చేయించేందుకు సిద్ధమవుతున్నారు ప్రభాస్. ప్రస్తుతం ఈ రెండో భాగం చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. తొలి భాగంలో కథంతా ప్రధానంగా ప్రభాస్ చేసిన భైరవ, అమితాబ్ పోషించిన అశ్వత్థామ పాత్రల చుట్టూనే తిరగ్గా.. ఈ సీక్వెల్ మాత్రం కురుక్షేత్ర మహాసంగ్రామాన్ని.. దీనికి భవిష్యత్ కాశి, శంబాల, కాంప్లెక్స్ ప్రపంచాలకు మధ్య ఉన్న కనెక్షన్‌ని మరింత లోతుగా స్పృశించనున్నట్లు అర్థమవుతోంది. ముఖ్యంగా ప్రభాస్ పోషించిన కర్ణుడి పాత్రకు దీంట్లో ఎంతో ప్రాధాన్యత ఉన్నట్లు తెలుస్తోంది. మరి ఈసారి ఈ 'కల్కి...' సీక్వెల్ బాక్సాఫీస్ ముందు ఎలాంటి సంచలనాల్ని సృష్టిస్తుందో తెలియాలంటే ఇంకొన్నాళ్లు వేచి చూడక తప్పదు.

'రాకా'.. సరికొత్త ప్రపంచం

'పుష్ప' సిరీస్ విజయాలతో జాతీయ స్థాయిలోనే కాక అంతర్జాతీయ స్థాయిలోనూ గుర్తింపు తెచ్చుకున్నారు కథానాయకుడు అల్లు అర్జున్. దీంతో ఇప్పుడాయన తదుపరి సినిమా 'రాకా'పై అందరిలో భారీ అంచనాలే ర్పడ్డాయి. దీన్ని దృష్టిలో పెట్టుకునే దర్శకుడు అట్లీ ఈ చిత్రాన్ని భారీ ఫాంటసీ హంగులతో కూడిన యాక్షన్ అడ్వెంచర్‌గా ఆవిష్కరించేందుకు సిద్ధమవుతున్నారు. కథ రీత్యా ఇది రెండు విభిన్న ప్రపంచాల్లో.. భిన్న కాలాల్లో జరిగే సినిమాగా ఉండనున్నట్లు తెలుస్తోంది. దీనికి తగ్గట్లే అల్లు అర్జున్ ఇందులో రెండు పాత్రల్లో అలరించనున్నారు. ఇటీవలే తోడేలు గెటప్‌లో ఉన్న తనకి సంబంధించిన ఓ లుక్‌ని విడుదల చేయగా.. ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభించింది. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా వచ్చే ఏడాది చివర్లో తెరపైకి వచ్చే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

విజయ్.. అదే దారిలో!

కథానాయకుడు విజయ్ దేవరకొండ ప్రస్తుతం 'రణబాలి', 'రౌడీ జనార్దన' సినిమాలతో సెట్స్‌పై బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ రెండూ పీరియాడిక్ యాక్షన్ డ్రామాలుగానే ముస్తాబవుతున్నాయి. అయితే వీటి తర్వాత తన నుంచి రానున్న కొత్త చిత్రంతో ప్రేక్షకులకు ఓ సరికొత్త ప్రపంచాన్ని పరిచయం చేయాలని ఉవ్విళ్లూరుతున్నారు విజయ్. ఆయన ప్రస్తుతం దర్శకుడు శౌర్యువ్‌తో ఓ గ్లోబల్ చిత్రం చేస్తున్నారు. మైథలాజికల్ యూనివర్స్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందనున్న ఈ సినిమా.. రెండు సమాంతర ప్రపంచాల్లో సాగే కథగా ఉండనున్నట్లు ప్రచారం వినిపిస్తోంది. ఈ చిత్రం కోసం ఓ సరికొత్త వరల్డ్‌ని సృష్టిస్తున్నట్లు చిత్ర బృందం ఇప్పటికే స్పష్టత ఇచ్చింది. మరి ఇది థియేటర్లలో ప్రేక్షకులకు ఎలాంటి అనుభూతిని అందించనుంది తెలియాలంటే ఇంకొన్నాళ్లు వేచి చూడక తప్పదు. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనుల్లో ఉన్న ఈ చిత్రం త్వరలో చిత్రీకరణ ప్రారంభించుకోనుంది.

భారత్ బంగారు గురి

షాంఘై: ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్-2లో భారత మహిళల రికర్వ్ జట్టు సంచలనం సృష్టించింది. దీపిక కుమారి సారథ్యంలోని భారత జట్టు స్వర్ణ పతకంతో అదరగొట్టింది. ఆదివారం ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్లో భారత్ షూటాఫ్‌లో 5-4 (28-26)తో ఆతిథ్య చైనాపై నెగ్గింది. దీపిక, అంకిత భకత్, కుంకుమ్ మొహొండ్‌ల బృందం అద్భుతమైన పోరాట పటిమతో చైనాను బోల్తాకొట్టించింది. తొలి సెట్‌లో ఆధిక్యం సంపాదించిన భారత్.. ఆ తర్వాత కాస్త తడబడింది. ఒక దశలో చైనా 4-2తో ముందంజ వేసి గెలుపు ముంగింట్లో నిలిచింది. అయితే నిర్ణయాత్మక నాలుగో సెట్‌లో చైనా క్రీడాకారిణి ఆఖరి బాణాన్ని లక్ష్యానికి దూరంగా సంధించడంతో భారత్ ఊపిరి పీల్చుకుంది. 4-4తో స్కోరు సమమవడంతో షూటాఫ్ అనివార్యమైంది. అంకిత 9 పాయింట్లతో షూటాఫ్‌ను ప్రారంభించగా.. కుంకుమ్ అద్భుతమైన ప్రదర్శనతో పదికి 10 సాధించింది. ఆఖరి బాణంతో దీపిక 9 పాయింట్లు నెగ్గడంతో భారత్ (28 స్కోరు)కు స్వర్ణం ఖాయమైంది. చైనా క్రీడాకారిణులు వరుసగా 9, 9, 8 పాయింట్లే సాధించడంతో స్కోరు 26కే పరిమితమైంది. నాలుగు సార్లు ఒలింపిక్స్‌లో పాల్గొన్న అనుభవంతో దీపిక జట్టును ముందుండి నడిపించింది. పూర్తిస్థాయి జాతీయ కోచ్ అందుబాటులో లేకపోయినా.. ఆమె తోటి క్రీడాకారిణుల్ని ప్రోత్సహిస్తూ పక్కా వ్యూహంతో పసిడి సంపాదించింది. అంతకుముందు సెమీఫైనల్లో 10 సార్లు ఒలింపిక్ ఛాంపియన్ దక్షిణ కొరియాను ఓడించడం భారత్ విజయంలో కీలక మలుపు. ఇక దీపికకు ఇది ఏడో ప్రపంచకప్ టీమ్ స్వర్ణ పతకం కావడం విశేషం. 2021 తర్వాత ప్రపంచకప్ మహిళల టీమ్ విభాగంలో భారత్‌కు ఇదే మొదటి బంగారు పతకం. మరోవైపు వ్యక్తిగత విభాగంలో సిమ్రన్‌జీత్ కౌర్‌కు నిరాశ ఎదురైంది. సెమీస్‌లో సిమ్రన్‌జీత్ 0-6తో ప్రపంచ నంబర్‌వన్ కాంగ్ చెయంగ్ (దక్షిణ కొరియా) చేతిలో ఓడింది. కాంస్య పతక పోరులో సిమ్రన్‌జీత్ 4-6తో జాంగ్ మిన్‌హే (దక్షిణ కొరియా) చేతిలో ఓడింది. ఒక స్వర్ణం, మరో కాంస్యంతో భారత్ ఈ టోర్నీని ముగించింది. పురుషుల కాంపౌండ్ విభాగంలో సాహిల్ జాదవ్ కాంస్యం నెగ్గాడు.

ఉత్కంఠ పోరులో ఆర్సీబీ విజయం

ఐపీఎల్ 19 ప్లేఆఫ్స్ రేసు నుంచి ఒకే రోజు రెండు జట్లు నిష్క్రమించాయి. టోర్నీలో ముంబయి ఇండియన్స్, లఖ్‌నవూ సూపర్‌జెయింట్స్ జట్ల కథ ముగిసింది. ఎనిమిదో ఓటమిని ఖాతాలో వేసుకున్న ఈ రెండు జట్ల పోరాటం ఇక నామమాత్రమే. ఆదివారం హోరాహోరీ సమరాల్లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు చేతిలో ముంబయి, చెన్నై సూపర్‌కింగ్స్ చేతిలో లఖ్‌నవూ ఓటమి చవిచూశాయి. ఐపీఎల్‌లో అత్యంత వేగవంతమైన అర్ధశతకం రికార్డును సమం చేసిన ఉర్విల్ పటేల్ చెన్నైని గెలిపిస్తే.. భువనేశ్వర్, కృనాల్ మెరుపులతో ఆర్సీబీకి విజయాన్నందించారు.

ఐపీఎల్ 19లో బెంగళూరు బలంగా పుంజుకుంది. ఆదివారం ఆఖరి బంతికి ఫలితం తేలిన మ్యాచ్‌లో ఆ జట్టు 2 వికెట్ల తేడాతో ముంబయిని ఓడించింది. మొదట ముంబయి.. భువనేశ్వర్ కుమార్ (4/23) ధాటికి 20 ఓవర్లలో 7 వికెట్లకు 166 పరుగులే చేసింది. తిలక్ (57; 42 బంతుల్లో 3×4, 2×6), నమన్ (47; 32 బంతుల్లో 5×4, 2×6) రాణించారు. ఛేదనలో కృనాల్ (73; 46 బంతుల్లో 4×4, 5×6) మెరుపులతో బెంగళూరు 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. బోష్ (4/26), దీపక్ చాహర్ (2/33) విజృంభించినా.. ముంబయిని గెలిపించలేకపోయారు. కెప్టెన్ హార్దిక్ పాండ్య గాయం నుంచి కోలుకోకపోవడంతో ఈ మ్యాచ్‌లోనూ ముంబయిని సూర్యకుమారే నడిపించాడు.

ఆర్సీబీ తడబడినా..: ఛేదనలో బెంగళూరు కూడా తడబడింది. తొలి ఓవర్లోనే ఆ జట్టుకు పెద్ద షాక్ తగిలింది. గత మ్యాచ్‌లో లఖ్‌నవూపై డకౌట్ అయిన స్టార్ బ్యాటర్ కోహ్లి.. మరోసారి సున్నాకే వెనుదిరిగాడు. దీపక్ చాహర్ బౌలింగ్‌లో కోహ్లి షాట్ ఆడగా.. మిడాఫ్‌లో రాజ్ బవా డైవింగ్ క్యాచ్ పట్టేశాడు. తర్వాత పడిక్కల్ (12)ను పెవిలియన్ చేర్చి ఆర్సీబీని దీపక్ చాహర్ మరో దెబ్బ కొట్టాడు. కెప్టెన్ పాటీదార్ (8) సైతం నిలవకపోవడంతో బెంగళూరు 5.1 ఓవర్లకు 39/3తో ఇబ్బందుల్లో పడింది. ఈ స్థితిలో బెతెల్, కృనాల్ జట్టును ఆదుకున్నారు. దూకుడుగా ఆడకపోయినా.. ఒకటి రెండు పరుగులు తీస్తూ స్కోరు పెంచారు. కుదురుకున్నాక కృనాల్ షాట్లకు దిగడంతో ఆర్సీబీ 10 ఓవర్లకు 74/3తో లక్ష్యం దిశగా సాగింది. కీలక సమయంలో బెతెల్ (27) ఔట్ కావడం, సాధించాల్సిన రన్‌రేట్ పెరగడంతో ఆర్సీబీ ఒత్తిడిలో పడింది. కానీ పట్టువదలకుండా ఆడిన కృనాల్.. జితేశ్‌తో కలిసి బెంగళూరును విజయపథంలో నడిపించాడు. ఈ క్రమంలోనే అతడు 32 బంతుల్లో అర్ధసెంచరీ అందుకున్నాడు. ఒకవైపు కాలు పట్టేసినా కృనాల్ తగ్గలేదు. మెరుపు షాట్లతో ఆర్సీబీని విజయానికి చేరువ చేశాడు. కానీ అతడు కీలక సమయంలో ఔట్ కావడంతో ఉత్కంఠ నెలకొంది. రాజ్ బవా వేసిన చివరి ఓవర్లో ఆర్సీబీ 15 పరుగులు చేయాల్సి వచ్చింది. తొలి మూడు బంతుల్లో (1 నోబాల్, 2 వైడ్లు సహా) 5 పరుగులు చేసిన ఆర్సీబీ.. రొమారియో షెపర్డ్ (4; 11 బంతుల్లో) వికెట్ కోల్పోయింది. 3 బంతుల్లో 10 పరుగులు అవసరమైన స్థితిలో.. నాలుగో బంతికి భువనేశ్వర్ (7 నాటౌట్) సిక్స్ బాదడంతో సమీకరణం 2 బంతుల్లో 4 పరుగులుగా మారింది. అయిదో బంతికి భువి సింగిల్ తీయగా.. చివరి బంతికి రసిఖ్ (3 నాటౌట్) రెండు పరుగులు రాబట్టడంతో ఆర్సీబీ ఉత్కంఠభరిత విజయాన్ని అందుకుంది.

భువి ధాటికి..: అంతకుముందు భువనేశ్వర్ విజృంభించడంతో ముంబయి ఒక మోస్తరు స్కోరుకే పరిమితమైంది. ఆ జట్టు ఇన్నింగ్స్ ఆరంభమైన తీరే పేలవం. ఈ సీజన్లో గొప్ప ఫామ్‌లో ఉన్న భువి దెబ్బకు ముంబయి దారుణంగా తడబడింది. తొలి ఓవర్లోనే రికెల్టన్ (2)ను ఔట్ చేసిన ఈ పేసర్.. ఇన్నింగ్స్ మూడో ఓవర్లో ముంబయికి డబుల్ షాక్ ఇచ్చాడు. జోరు మీద కనిపించిన రోహిత్ (22; 10 బంతుల్లో 2×4, 2×6)ను భువి నకుల్ బంతితో బుట్టలో వేశాడు. వైఫల్యాలను కొనసాగిస్తూ సూర్యకుమార్ (0) తొలి బంతికే పెవిలియన్ చేరాడు. 3 ఓవర్లకు 28/3తో ముంబయి కష్టాల్లో పడిపోయింది. ఈ స్థితిలో నమన్ ధీర్, తిలక్ వర్మ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. దీంతో 10 ఓవర్లకు 88/3తో ముంబయి కోలుకుంది. కానీ రెండు ఓవర్ల వ్యవధిలో నమన్ ధీర్, జాక్స్ (10) ఔటైపోవడం, అర్ధసెంచరీ తర్వాత తిలక్ కూడా భువి బౌలింగ్‌లో వెనుదిరగడంతో ఆ జట్టు 170లోపు స్కోరుకే పరిమితమైంది.

స్కోరు వివరాలు

గుజరాత్ ఇన్నింగ్స్: సుదర్శన్ (సి) ఆర్చర్ ముంబయి ఇన్నింగ్స్: రికెల్టన్ (సి) పాటీదార్ (బ) భువనేశ్వర్ 2; రోహిత్ (సి) జితేశ్ (బ) భువనేశ్వర్ 22; నమన్ (సి) రసిఖ్ 47; సూర్య (సి) కోహ్లి (బ) భువనేశ్వర్ 0; తిలక్ (బ) భువనేశ్వర్ 57; జాక్స్ (సి) బెతెల్ (బ) షెపర్డ్ 10; బవా (సి) పాటీదార్ (బ) హేజిల్‌వుడ్ 16; బోష్ నాటౌట్ 5; దీపక్ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 6 మొత్తం: (20 ఓవర్లలో 7 వికెట్లకు) 166; వికెట్ల పతనం: 1-4, 2-28, 3-28, 4-110, 5-132, 6-155, 7-161; బౌలింగ్: భువనేశ్వర్ 4-0-23-4; హేజిల్‌వుడ్ 4-0-33-1; రసిఖ్ 4-0-42-1; షెపర్డ్ 3-0-18-1; కృనాల్ 3-0-26-0; సుయాశ్ 2-0-21-0

బెంగళూరు ఇన్నింగ్స్: బెతెల్ (సి) తిలక్ (బ) బోష్ 27; కోహ్లి (సి) బవా (బ) దీపక్ 0; పడిక్కల్ (సి) రికెల్టన్ (బ) దీపక్ 12; పాటీదార్ (సి) రికెల్టన్ (బ) బోష్ 8; కృనాల్ (సి) తిలక్ (బ) ఘజన్‌ఫర్ 73; జితేశ్ (సి) ధీర్ (బ) బోష్ 18; డేవిడ్ (సి) రికెల్టన్ (బ) బోష్ 0; షెపర్డ్ (సి) తిలక్ (బ) బవా 4; రసిఖ్ నాటౌట్ 3; భువనేశ్వర్ నాటౌట్ 7; ఎక్స్‌ట్రాలు 16 మొత్తం: (20 ఓవర్లలో 8 వికెట్లకు) 167; వికెట్ల పతనం: 1-10, 2-24, 3-39, 4-94, 5-131, 6-131, 7-149, 8-157; బౌలింగ్: దీపక్ 4-0-33-2; బుమ్రా 4-0-20-0; బోష్ 4-1-26-4; జాక్స్ 2-0-13-0; ఘజన్‌ఫర్ 3-0-33-1; బవా 3-0-39-1

ఉర్విల్ పటేల్ విధ్వంసం..

లఖ్‌నవూపై చెన్నై విజయం

చెన్నై సూపర్‌కింగ్స్ అదరగొట్టింది. ఉర్విల్ పటేల్ (65; 23 బంతుల్లో 2×4, 8×6) నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడడంతో ఆదివారం ఆ జట్టు 5 వికెట్ల తేడాతో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌ను మట్టికరిపించింది. జోస్ ఇంగ్లిష్ (85; 33 బంతుల్లో 10×4, 6×6) చెలరేగడంతో మొదట లఖ్‌నవూ 8 వికెట్ల నష్టానికి 203 పరుగులు చేసింది. షాబాజ్ అహ్మద్ (43 నాటౌట్; 25 బంతుల్లో 3×4, 3×6) కూడా రాణించాడు. చెన్నై బౌలర్లలో ఒవర్టన్ (3/36), నూర్ అహ్మద్ (1/24) ఆకట్టుకున్నారు. ఉర్విల్‌తో పాటు రుతురాజ్ (42; 28 బంతుల్లో 3×4, 2×6) సత్తా చాటడంతో లక్ష్యాన్ని సీఎస్కే 19.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. 2019 తర్వాత ఐపీఎల్‌లో 180+ లక్ష్యాన్ని చెన్నై ఛేదించడం ఇదే తొలిసారి కావడం విశేషం.

పటేల్ ఫటాఫట్: చెన్నై విజయాన్నందుకుందంటే ప్రధాన కారణం ఉర్విల్ పటేల్ విధ్వంసమే. గెలుపు ముంగిట తడబడ్డ సీఎస్కే.. ఆరంభంలో ఉర్విల్ ధనాధన్ ఇన్నింగ్స్ కారణంగా సాధించాల్సిన రన్‌రేట్ అందుబాటులో ఉండడంతో గట్టెక్కింది. ఛేదనలో శాంసన్ (28; 14 బంతుల్లో 3×4, 2×6) చెలరేగడంతో 4వ ఓవర్లో 45/0తో బలంగా నిలిచింది చెన్నై. శాంసన్‌ను దిగ్వేశ్ ఔట్ చేసినా.. లఖ్‌నవూకు ఎలాంటి ఉపశమనం దక్కలేదు సరికదా.. ఆ జట్టు పరిస్థితి దయనీయంగా మారింది. శాంసన్ స్థానంలో వచ్చిన ఉర్విల్ భీకరంగా విరుచుకుపడ్డాడు. పిడుగుల్లాంటి షాట్లతో సిక్స్‌ల మోత మోగించిన అతడు.. స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. ప్రత్యర్థి బౌలింగ్‌ను ఊచకోత కోశాడు. అవేష్ ఓవర్లో వరుసగా మూడు సిక్స్‌లు దంచిన అతడు.. దిగ్వేశ్ ఓవర్లో మూడు సిక్స్‌లు, ఫోర్ బాదేశాడు. షమి బౌలింగ్‌లోనూ ఓ సిక్స్ కొట్టిన ఉర్విల్.. ఓ సింగిల్‌తో అర్ధశతకం పూర్తి చేశాడు. పదో ఓవర్లో ఉర్విల్ నిష్క్రమించేటప్పటికి స్కోరు 125. చెన్నై విజయం చాలా తేలికే అనుకున్నారంతా. కానీ ఆ జట్టు అనూహ్యంగా ఒత్తిడికి గురైంది. ఓపెనర్ రుతురాజ్ ధాటిగా ఆడలేకపోయాడు. కార్తీక్ శర్మ కూడా అంతే. పరుగులు చేయడానికి చెమటోడ్చాడు. హఠాత్తుగా బౌండరీల రాక ఆగిపోయింది. 15 ఓవర్లు ముగిసే సరికి రుతురాజ్ వికెట్‌ను కోల్పోయిన సీఎస్కే 165/3తో నిలిచింది. పరుగుల రాకపోవడంతో అసహనానికి గురైన బ్రెవిస్.. తర్వాతి ఓవర్లో బౌల్డయ్యాడు. కార్తీక్ శర్మ కూడా ఔట్ కావడంతో మ్యాచ్ ఆసక్తికరంగా మారింది. పరుగుల రాక కష్టమైన వేళ, చివరి మూడు ఓవర్లలో 30 పరుగులు చేయాల్సిన స్థితిలో సీఎస్కేపై ఒత్తిడి పెరిగింది. లఖ్‌నవూకు ఆశలు రేగాయి. అయితే ప్రశాంత్ వీర్.. 18, 19వ ఓవర్లలో ఒక్కో సిక్స్ కొట్టడంతో చెన్నై పని తేలికైంది. ఆఖరి ఓవర్లో ఆ జట్టు 10 పరుగులు చేయాల్సిన స్థితిలో స్పిన్నర్ మార్‌క్రమ్ రెండు వైడ్లతో మొదలు పెట్టాడు. ఆ తర్వాత దూబె వరుసగా రెండు సిక్స్‌లతో సీఎస్కేను గెలిపించాడు.

మెరిసిన ఇంగ్లిస్: ఇంగ్లిస్ విధ్వంసంతో మొదట లఖ్‌నవూ మెరుగైన లక్ష్యాన్ని నిర్దేశించగలిగింది. అయితే ఘనంగా ఆరంభించిన ఆ జట్టు.. ఇంకా పెద్ద స్కోరే చేయాల్సింది. కానీ చెన్నై బంతితో పుంజుకుని లఖ్‌నవూను కట్టడి చేయగలిగింది. ముఖ్యంగా ఒవర్టన్, నూర్ అహ్మద్ సూపర్‌గా బౌలింగ్ చేశారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూ.. ఇంగ్లిస్ విధ్వంసంతో 5 ఓవర్లలో 77/0తో తిరుగులేని స్థితిలో నిలిచింది. హూసీన్ వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్లో వరుసగా 6, 4, 6 బాదిన ఇంగ్లిస్... అదే జోరును కొనసాగించాడు. కాంబోజ్ ఓవర్లో రెండు సిక్స్‌లు, ముకేశ్ ఓవర్లో రెండు ఫోర్లు, రెండు సిక్స్‌లతో చెలరేగిపోయాడు. హూసీన్ బౌలింగ్‌లో వరుసగా 4, 4, 6, 4 దంచేశాడు. ఇంగ్లిస్ కేవలం 17 బంతుల్లోనే అర్ధశతకం సాధించాడు. ఆరో ఓవర్ నుంచి ఆట స్వరూపమే మారిపోయింది. మార్‌ష్‌ను ఔట్ చేయడం ద్వారా ఎల్ఎస్‌జీ పతనాన్ని ఆరంభించిన సీఎస్కే.. కట్టుదిట్టమైన బౌలింగ్‌తో క్రమం తప్పకుండా వికెట్లు పడగొట్టి పరుగుల వేగానికి కళ్లెం వేసింది. పేలవ ఫామ్‌ను కొనసాగిస్తూ పూరన్ (1) ఇలా వచ్చి అలా వెళ్లగా.. పదో ఓవర్లో ఇంగ్లిస్, పంత్ (15)ను ఔట్ చేయడం ద్వారా లఖ్‌నవూను ఒవర్టన్ గట్టి దెబ్బతీశాడు. మార్‌క్రమ్ (6) రనౌటయ్యాడు. అక్షత్ రఘువంశీ (18) నిలబడ్డా.. వేగంగా పరుగులు చేయలేకపోయాడు. 7 16 మధ్య 10 ఓవర్లలో లఖ్‌నవూ.. 5 వికెట్లు కోల్పోయి 68 పరుగులు మాత్రమే చేయగలిగింది. అయితే షాబాజ్ బ్యాట్ ఝుళిపించడంతో ఆఖరి నాలుగు ఓవర్లలో ఎల్ఎస్‌జీ 44 పరుగులు రాబట్టింది.

ఐపీఎల్‌లో వేగవంతమైన అర్ధశతకాలు (బంతుల్లో)
13 జైస్వాల్ (రాజస్థాన్), 2023లో కోల్‌కతాపై
13 ఉర్విల్ పటేల్ (చెన్నై), 2026లో లఖ్‌నవూపై
14 రాహుల్ (పంజాబ్), 2018లో దిల్లీపై
14 కమిన్స్ (కోల్‌కతా), 2022లో ముంబయిపై
14 షెపర్డ్ (బెంగళూరు), 2025లో చెన్నైపై

యశస్వి రికార్డు సమం

చెన్నై బ్యాటర్ ఉర్విల్ పటేల్ పెను విధ్వంసం సృష్టించాడు. సిక్స్‌లతో విరుచుకుపడ్డ ఈ బ్యాటర్ కేవలం 13 బంతుల్లోనే అర్ధశతకం సాధించాడు. రాజస్థాన్ బ్యాటర్ యశస్వి జైస్వాల్ పేరిట ఉన్న అత్యంత వేగవంతమైన ఐపీఎల్ అర్ధసెంచరీ రికార్డు (13 బంతుల్లో)ను ఉర్విల్ సమం చేశాడు. జైస్వాల్ 2023లో కోల్‌కతాపై ఈ రికార్డు సృష్టించాడు. 27 ఏళ్ల ఉర్విల్ దేశవాళీల్లో గుజరాత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. తన మెరుపు అర్ధసెంచరీని అతడు తన తండ్రికి అంకితమిచ్చాడు. మైలురాయిని అందుకున్న అనంతరం ఉర్విల్ జేబులోనుంచి ఓ పేపర్ తీసి చూపించాడు. దానిపై 'నాన్నా.. ఇది నీ కోసం'' అని రాసి ఉంది.

'నాన్నా ఇది నీ కోసం' అని రాసి ఉన్న కాగితం చూపిస్తూ..

తొలి 10 బంతుల్లో అత్యధిక పరుగులు (42) చేసిన బ్యాటర్‌గా కూడా ఉర్విల్ ఘనత సాధించాడు. ఐపీఎల్‌లో అత్యంత వేగవంతమైన అర్ధశతకం సాధించిన యశస్వి జైస్వాల్ (13 బంతుల్లో, 2023లో కోల్‌కతాపై)ను ఉర్విల్ పటేల్ సమం చేశాడు.

స్కోరు వివరాలు

గుజరాత్ ఇన్నింగ్స్: సుదర్శన్ (సి) లఖ్‌నవూ ఇన్నింగ్స్: ఇంగ్లిస్ (సి) శాంసన్ (బ) ఒవర్టన్ 85; మిచెల్ మార్ష్ (సి) బ్రెవిస్ (బ) కాంబోజ్ 10; పూరన్ (సి) సర్ఫరాజ్ (బ) నూర్ 1; పంత్ (బ) ఒవర్టన్ 15; మార్‌క్రమ్ రనౌట్ 6; అక్షత్ రఘువంశీ (సి) ఉర్విల్ (బ) ఒవర్టన్ 18; షాబాజ్ నాటౌట్ 43; హిమ్మత్ (బ) కాంబోజ్ 17; షమి రనౌట్ 0; అవేష్ ఖాన్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 8 మొత్తం: (20 ఓవర్లలో 8 వికెట్లకు) 203; వికెట్ల పతనం: 1-77, 2-92, 3-112, 4-115, 5-130, 6-147, 7-197, 8-197; బౌలింగ్: అకీల్ 4-0-49-0; ముకేశ్ 4-0-45-0; కాంబోజ్ 4-0-47-2; నూర్ అహ్మద్ 4-0-24-1; ఒవర్టన్ 4-0-36-3

చెన్నై ఇన్నింగ్స్: సంజు శాంసన్ (బ) దిగ్వేశ్ రాఠి 28; రుతురాజ్ (బ) షాబాజ్ 42; ఉర్విల్ పటేల్ (సి) అవేష్ ఖాన్ (బ) షాబాజ్ 65; కార్తీక్ శర్మ (సి) అక్షత్ (బ) అవేష్ ఖాన్ 20; బ్రెవిస్ (బ) దిగ్వేశ్ రాఠి 10; శివమ్ దూబె నాటౌట్ 15; ప్రశాంత్ వీర్ నాటౌట్ 17; ఎక్స్‌ట్రాలు 11 మొత్తం: (19.2 ఓవర్లలో 5 వికెట్లకు) 208; వికెట్ల పతనం: 1-45, 2-126, 3-149, 4-169, 5-169; బౌలింగ్: షమి 4-0-37-0; ప్రిన్స్ యాదవ్ 4-0-36-0; దిగ్వేశ్ రాఠి 4-0-45-2; అవేష్ ఖాన్ 4-0-44-1; షాబాజ్ అహ్మద్ 3-0-30-2; మార్‌క్రమ్ 0.2-0-14-0

పంజాబ్ పుంజుకునేనా!

ధర్మశాల: ఐపీఎల్ 19 ప్రథమార్ధంలో ఓటమే లేకుండా సాగిపోయి, ఆ తర్వాత వరుసగా మూడు పరాజయాలతో ప్లేఆఫ్స్ రేసులో కాస్త వెనుకబడ్డ పంజాబ్.. సోమవారం కీలక పోరుకు సిద్ధమైంది. 10 మ్యాచ్‌ల్లో 13 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్న ఆ జట్టు.. 11 మ్యాచ్‌ల్లో ఏడు ఓటములతో దాదాపుగా ప్లేఆఫ్‌కు దూరమైన దిల్లీ క్యాపిటల్స్‌తో తలపడనుంది. పట్టికలో దిగువన ఉన్న జట్లు అనూహ్యంగా పుంజుకుని ప్లేఆఫ్స్ రేసులోకి వస్తుండడంతో ఈ మ్యాచ్ గెలవడం శ్రేయస్ సేనకు అత్యావశ్యకం. మూడు మ్యాచ్‌ల్లో రెండు గెలిస్తే ఆ జట్టుకు ప్లేఆఫ్స్ బెర్తు ఖాయమవుతుంది. ఒకటి నెగ్గినా అవకాశముంటుంది కానీ, సమీకరణాలు కలిసి రావాలి. కెప్టెన్ శ్రేయస్‌తో పాటు ఫామ్‌లో ఉన్న ప్రభ్‌సిమ్రన్ సింగ్, ప్రియాంశ్ ఆర్య రాణించాలని పంజాబ్ కోరుకుంటోంది. లీగ్ ఆరంభంలో సత్తా చాటి, ఆ తర్వాత గాడి తప్పిన డీసీ.. పోరాడితే పోయేదేముందని తెగించి ఆడే అవకాశం లేకపోలేదు. స్టార్ స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ వైఫల్యం దిల్లీని దెబ్బ కొడుతోంది. బ్యాటింగ్‌లోనూ ఆ జట్టులో స్థిరత్వం లేదు. మరి డీసీ.. పంజాబ్‌పై ఎలా ఆడుతుందనేది ఆసక్తికరం.

వైభవ్ విధ్వంసం కంటే..

గుజరాత్ నిలకడే బెటర్: హెడెన్

భారీ స్కోర్ మ్యాచ్‌ల్లో దూకుడైన బ్యాటింగ్ చూడ ముచ్చటగా ఉన్నా.. నిలకడైన స్ట్రైక్ రేట్‌తో సుదీర్ఘంగా ఆడితేనే విజయం వరిస్తుందని గుజరాత్ బ్యాటింగ్ కోచ్ మాథ్యూ హెడెన్ అభిప్రాయపడ్డాడు. రాజస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో కెప్టెన్ గిల్, ఓపెనర్ సాయి సుదర్శన్‌ల బ్యాటింగ్‌ను అతడు పొగడ్తలతో ముంచెత్తాడు. ఈ క్రమంలో రాజస్థాన్ ఓపెనర్ సూర్యవంశీపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ''వైభవ్ సూర్యవంశీ 300 స్ట్రైక్‌రేట్‌తో 30 పరుగులు చేయడం ఉత్తేజకరంగా అనిపించినా.. మీరు 220 పరుగులకు పైగా లక్ష్యాన్ని ఛేదిస్తుంటే నిలకడగా.. సుదీర్ఘ సమయం క్రీజులో ఉండటం అవసరం. మా వద్ద ఉన్న టాప్ 3 ఆటగాళ్లు 150 స్ట్రైక్ రేటు వద్ద నిలకడగా ఆడగలరు. వాస్తవానికి అలా బ్యాటింగ్ చేయడం కష్టం. కానీ, మా వాళ్లు సుదీర్ఘకాలంగా నిలకడగా ఆడుతున్నారు. ఇది కేవలం పవర్ ప్లేకే పరిమితం కాకుండా.. ఇన్నింగ్స్ సగం వరకు కొనసాగుతుందన్నారు. వారి ఫిట్‌నెస్, టెస్ట్‌లు, వన్డేల అనుభవం ఇక్కడ ఉపయోగపడుతోందని వివరించారు. రాజస్థాన్‌కు మా వాళ్లు బలమైన టార్గెట్‌ను ఇచ్చారు. గతంలో మేము చేసిన పలు 160 రేంజి స్కోర్ల కంటే ఇది భిన్నమైంది. రాజస్థాన్ వంటి ఎక్స్‌ఫ్యాక్టర్ జట్టుపై సవాళ్లను ఎదుర్కోవడం బాగుంది'' అని హెడెన్ అభిప్రాయపడ్డాడు. ఈ మ్యాచ్‌లో ఓపెనర్ గిల్ 160, బట్లర్ 151 స్ట్రైక్‌రేట్‌తో రాణించారు. ఇక సుదర్శన్ ఈ సీజన్ మొత్తంలో 157 స్ట్రైక్‌రేట్‌తో ఆడి 440 పరుగులు సాధించడం విశేషం. ఈ సీజన్‌లో రాజస్థాన్ ఓ పేలవమైన రికార్డును మూటగట్టుకొంది. నిన్నటి మ్యాచ్‌లో గుజరాత్ 229 పరుగులు చేయడంతో.. ఈ సీజన్‌లో ప్రత్యర్థులు 7 సార్లు 200+ స్కోర్లు చేసిన తొలి జట్టుగా రాజస్థాన్ నిలిచింది. గత సీజన్‌లో సన్‌రైజర్స్, రాజస్థాన్, లఖనవూ, పంజాబ్ జట్లపై ప్రత్యర్థులు ఏడేసి సార్లు 200+ స్కోర్లు చేశారు. ఈ మ్యాచ్‌లో మూడు సిక్సర్లు బాదిన వైభవ్ సూర్యవంశీ ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. టీ20 క్రికెట్లో వేగంగా 100 సిక్సర్లు బాదిన క్రికెటర్‌గా వైభవ్ ఘనత సాధించాడు. 514 బంతుల్లోనే ఈ ఫీట్ అందుకున్నాడు.